


RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

Epaper.Telanganapatrika.in




EDITOR :BOORLA VENKATESHAM KARIMNAGAR VOLUME:18 ISSUE:119 FRIDAY ,OCTOBER 09 ,2026 PAGES:12 COST: 2 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :119 శుక్రవారం, అక్టోబర్ 09, 2026, పేజీలు -12 వెల :2/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI



# ధర్మేంద్ర ప్రధాన్‌కు ఏం జరిగిందో..
# ప్రధాని మోదీకి అదే జరుగుతుంది

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి
- ఓట్ల తొలగింపుపై బీజేపీ, కేంద్రంపై తీవ్ర విమర్శలు
- ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్

**తెలంగాణ పత్రిక:** ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. జ్ఞానేశ్ కుమార్‌పై ప్రధాని మోదీ చర్యలు తీసుకోవాలని సూచించారు. గురువారం సీఈసీకి వ్యతిరేకంగా విపక్షాలు చేపట్టిన నిరసనలో పాల్గొన్న రేవంత్.. బీజేపీ తీరును తీవ్రంగా విమర్శించారు.'మొదట మతాన్ని, భాషను ఉపయోగించుకుని ప్రధాని మోదీ నెగ్గేందుకు ప్రయత్నించారు. ఆ తరువాత ఈడీ, సీబీఐ మిగతా2లో



# లోక్‌భవన్ వద్ద ఉద్రిక్తత..

## హైదరాబాద్‌లో ఇండియా కూటమి 'చలో లోక్‌భవన్' ర్యాలీ.

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్
- లోక్‌భవన్ వద్ద పోలీసుల బారికేడ్లు
- పోలీసులతో నేతలకు తీవ్ర వాగ్వాదం
- పొన్నం, మహేశ్ గౌడ్ సహా నేతల అరెస్ట్

**తెలంగాణ పత్రిక:** 'సేవ్ డెమోక్రసీ' పేరుతో ఇండీ కూటమి హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఛలో లోక్‌భవన్' కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నుంచి లోక్‌భవన్ వరకు కూటమి నేతలు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. 2లో

## ఆ నలుగురికి కచ్చితంగా
# శిక్ష పడుతుంది



సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని విపక్షాల డిమాండ్
మూడో రోజుకు చేరిన ఇండియా కూటమి నిరసనలు
వారికి శిక్ష తప్పదని, ఇది తన హామీ అని వ్యాఖ్య
రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలవనున్న విపక్ష ఎంపీలు

**తెలంగాణ పత్రిక:** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'ఇండియా' కూటమి ఢిల్లీలో చేపట్టిన నిరసనలు మూడో రోజుకు చేరుకున్నాయి. గురువారం సైతం విపక్ష మిగతా2లో



## బెంగాల్, బీహార్ తర్వాత తెలంగాణను టార్గెట్ చేస్తున్నారు

మోదీ ప్రభుత్వంపై పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ తీవ్ర ఆరోపణలు

బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై 92 లక్షల ఓట్లు తొలగించాయని వ్యాఖ్య

ప్రజాస్వామ్యాన్ని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఖూనీ చేస్తున్నారని ఆగ్రహం

**తెలంగాణ పత్రిక:** తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై ఏకంగా 92 లక్షల ఓట్లను తొలగించాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉండటానికి మోదీ ప్రభుత్వం కుట్రలు మిగతా2లో

# జూరాల నీళ్లు వదిలిన రైతులపై కేసులు



## రైతులకు బేడీలా?

- జూరాల నీటి కోసం ఆందోళన చేసిన రైతులపై కేసులు నమోదు
- ప్రభుత్వ చర్యపై తీవ్రంగా మండిపడ్డ మాజీ మంత్రి హరీశ్ రావు
- ఇది ప్రజా పాలన కాదు, ప్రజా పీడన అంటూ విమర్శలు
- రైతులపై కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ 2



వనపర్తి జిల్లాలో 14 మంది రైతులపై పోలీసులు కేసు నమోదు
జూరాల కాలువకు బలవంతంగా నీళ్లు విడుదల చేయడమే ఇందుకు కారణం
పంటలు ఎండిపోతున్నా అధికారులు స్పందించకపోవడంతో గేట్లు ఎత్తిన రైతులు
ఇరిగేషన్ డీఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడి
నీటి కోసం ధర్నా చేసిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులపై కూడా కేసులు

**తెలంగాణ పత్రిక:** సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయన్న ఆవేదనతో, జూరాల ప్రాజెక్టు కాలువకు బలవంతంగా నీటిని విడుదల చేసిన 14 మంది రైతులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వనపర్తి జిల్లా అమరచింత పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. సాగునీటి పారుదల శాఖ డిప్యూటీ మిగతా2లో



## మొబైల్ ఫోన్ ఇప్పుడు సుపరిపాలనకు సాధనం

భారత టెలికాం రంగం కేవలం నెట్‌వర్క్‌లు, స్పెక్ట్రమ్, ఇంటర్నెట్ వేగానికే పరిమితం కాలేదని, సుపరిపాలన, ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించడంలో మొబైల్ కనెక్టివిటీ ఒక కీలక శక్తిగా ఆవిర్భవించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. 2

## సీఈసీ, కమిషనర్ల నియామకాలు
# రద్దు చేయాలి..



- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నియామకాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్
- ఇద్దరు కమిషనర్ల నియామకం, 2023 చట్టంపైనా పిటిషన్‌లో అభ్యంతరం
- సెలక్షన్ కమిటీ నుంచి సీజేఐని తొలగించడాన్ని ప్రశ్నించిన పిటిషనర్ 2



# నాపై పోటీ చేసి గెలువు

## కేటీఆర్‌కు దానం నాగేందర్ సవాల్

- ఖైరతాబాద్ బరిలో దిగాలని కేటీఆర్‌కు దానం నాగేందర్ సవాల్
- ఉప ఎన్నిక తమ ప్రభుత్వ పాలనకు రెఫరెండం అని వ్యాఖ్య
- ఇండియా కూటమి 'సేవ్ డెమోక్రసీ' ర్యాలీలో కీలక వ్యాఖ్యలు

**తెలంగాణ పత్రిక:** దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్న తరుణంలో, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ నియామకానికి సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆయనతో పాటు మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్ల నియామకాలను సవాలు చేస్తూ మిగతా2లో

## తెలంగాణలో మండుతున్న ఎండలు..



తెలంగాణలో మళ్లీ పెరిగిన ఎండల తీవ్రత
ఆదిలాబాద్‌లో గరిష్ఠంగా 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
రాష్ట్రం నుంచి నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రారంభం

**తెలంగాణ పత్రిక:** తెలంగాణలో ఎండల తీవ్రత మళ్లీ పెరుగుతోంది. నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ప్రారంభం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. పగటిపూట ఎండ ప్రతాపం, రాత్రి వేళల్లో ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గురువారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక మిగతా2లో

# ధర్మేంద్ర ప్రధాన్‌కు ఏం జరిగిందో.. ప్రధాని మోదీకి అదే జరుగుతుంది

ఆ తరువాత ఈడీ, సీబీఐ సంస్థలను ఉపయోగించి గెలిచేందుకు ప్రయత్నాలు చేశారు. ఇప్పుడు ఈ ప్రయోగాలు చెల్లవని 13 కోట్ల ఓట్లు తొలగించి మళ్లీ అధికారం చేపట్టాలనుకుంటున్నారు' అని ఆయన మండిపడ్డారు. బ్రిటీషర్స్ సైమన్ కమిషన్ వాడితే, బీజేపీ ఎన్నికల కమిషన్ వాడుతోందని ఆరోపించారు. నాడు భగత్ సింగ్ పోరాటం చేస్తే నేడు రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారన్నారు. బలహీన వర్గాల వారి ఓట్లను కాపాడటమే రాహుల్ గాంధీ లక్ష్యమన్నారు. ఓట్ల తొలగింపు కాంగ్రెస్ సమస్య కాదని దేశ ప్రజల సమస్య అని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని, 'సర్' ప్రక్రియను రద్దు చేయాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ పంతాలకు పోకుండా వెంటనే స్పందించాలన్నారు. లేకపోతే ధర్మేంద్ర ప్రధాన్ విషయంలో ఏం జరిగిందో ప్రధాని మోదీ విషయంలో కూడా అదే జరుగుతుందని హెచ్చరించారు. అక్రమ ఓట్ల తొలగింపు ద్వారా రెండు రకాల పౌరులు ఏర్పడుతున్నారని రేవంత్ వివరించారు. ఓటు ఉన్నవారు ఓటు లేని వారిని ద్వితీయ పౌరులుగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

# లోక్‌భవన్ వద్ద ఉద్రిక్తత..

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం 'ఛలో లోక్‌భవన్'కు కాంగ్రెస్, టీజేఏస్, లెఫ్ట్ పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ నిరసనలో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు, ఇండియా కూటమి రాష్ట్ర నేత లు పాల్గొని ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఖైరతాబాద్ నుంచి లోక్‌భవన్ వైపు ర్యాలీగా బయలుదేరిన నేతలను అడ్డుకున్నారు. లోక్‌భవన్‌కు 300 మీటర్ల దూరంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. లోక్‌భవన్ వైపుకు రానీ యకుండా ఆందోళన కారులను బారికేడ్లతో అడ్డుకు న్నారు. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. ర్యాలీని అడ్డుకున్న పోలీసులపై మంత్రులు, ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఆందోళనకు దిగిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, అజారుద్దీన్‌ను పోలీ సులు అరెస్ట్ చేశారు. వారిని పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలి ంచారు. మరోవైపు దేశవ్యా ప్తంగా ఇండియా కూట మి ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగుతున్నాయి.

# జూరాల నీళ్లు వదిలిన రైతులపై కేసులు..

సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయన్న ఆవేదనతో, జూరాల ప్రాజెక్టు కాలువకు బలవంతంగా నీటిని విడుదల చేసిన 14 మంది రైతులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వనపర్తి జిల్లా అమరచింత పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. సాగునీటి పారుదల శాఖ డిప్యూటీ ఇంజినీర్ (డీఈ) ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అమరచింత ఎస్సై స్వాతి గురువారం వెల్లడించారు. సాగునీరు విడుదల చేయకపోవడంతో తమ పంటలు కళ్లెదుటే ఎండిపోతున్నాయని రైతులు గత కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు విన్నవించినా స్పందన లేకపోవడంతో, గత నెల సెప్టెంబర్ 19వ తేదీ సాయంత్రం వారే నేరుగా జూరాల ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. ప్రాజెక్టు గేట్లు ఎత్తి కాలువ ద్వారా తమ పొలాలకు నీటిని విడుదల చేసుకున్నారు. సెప్టెంబర్ 19, 20 తేదీల్లో చోటుచేసుకున్న ఈ పరిణామాలపై ఇరిగేషన్ డీఈ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగానే రైతులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదే వ్యవహారంలో మరికొందరిపై కూడా కేసులు నమోదయ్యాయి. జూరాల ప్రాజెక్టు నుంచి తక్షణమే సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 21వ తేదీన జమ్మిచేడు వద్ద ధర్నా నిర్వహించిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులపై కూడా కేసులు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

# రైతులకు బేడీలా?: కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్ రావు ఆగ్రహం

పంటలు కాపాడుకునేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయాలని ఆందోళన చేసిన రైతులపై పోలీసులు కేసులు నమోదు చేశారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా మండిపడ్డారు. ఇది ప్రభుత్వ దిగజారుడు తనానికి నిదర్శనమని, అత్యంత హేయమైన చర్య అని విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' ఖాతా వేదికగా స్పందించారు. "కళ్ల ముందే ఎండుతున్న పంటలకు నీరివ్వమని అడిగిన రైతుల పై కేసులు పెట్టడం సిగ్గుచేటు. రేవంత్ రెడ్డి పాలనలో రైతుల చేతులకు బేడీలు వేయడం, పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టడం పరిపాటిగా మారింది" అని హరీశ్ రావు విమర్శించారు. వారి చేతగాని తనం వల్ల పంటలకు నీరందకపోతే, కడుపు మండి నిలదీసిన రైతులపై అక్రమ కేసులు బనాయిస్తారా? అని ప్రశ్నించారు. కృష్ణాలో నీటి ప్రవాహాలు ఉన్నప్పుడు నీటిని లిఫ్ట్ చేయకుండా ఉద్దేశపూర్వ కంగా నిర్లక్ష్యం వహించి, ఇప్పుడు రైతులను శిక్షిస్తున్నారని ఆరోపించారు. "ఇది ప్రజా పాలన కాదు. ప్రజా పీడన. తప్పు ప్రభుత్వం చేస్తే శిక్ష రైతులు అనుభవించాలా?" అని హరీశ్ రావు నిలదీశారు. రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ పక్షాన డిమా ండ్ చేస్తున్నామని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# మొబైల్ ఫోన్ ఇప్పుడు సుపరిపాలనకు సాధనం

భారత టెలికాం రంగం కేవలం నెట్‌వర్క్‌లు, స్పెక్ట్రమ్, ఇంటర్నెట్ వేగానికే పరిమితం కాలేదని, సుపరిపాలన, ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించడంలో మొబైల్ కనెక్టివిటీ ఒక కీలక శక్తిగా ఆవిర్భవించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. నేడు ఢిల్లీలో ప్రారంభమైన 10వ 'ఇండియా మొబైల్ కాంగ్రెస్' (ఐఎంసీ) 2026 సదస్సును ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. గత దశాబ్ద కాలంలో మొబైల్ ఫోన్లు సాధారణ కమ్యూనికేషన్ పరికరాల స్థాయి నుంచి సుపరిపాలనను అందించే ముఖ్యమైన సాధనాలుగా రూపాంతరం చెందాయని అన్నారు. 'మొబైల్ ఫోన్ ఇప్పుడు సుపరిపాలనకు ఒక సాధనంగా మారింది' అని ఆయన పేర్కొన్నారు. భారత టెలికాం ప్రస్థానంలో ఇండియా మొబైల్ కాంగ్రెస్ కీలక పాత్ర పోషించిందని ప్రధాని గుర్తుచేశారు. "2022లో ఇదే వేదికపై దేశంలో 5జీ సేవలను ప్రారంభించాం. 2023 నాటికి 5జీని దేశవ్యాప్తంగా విస్తరింపజేయడంలో ముందడుగు వేశాం. ఈ రోజు దేశంలోని ప్రతి జిల్లాకు 5జీ కనెక్టివిటీ చేరింది. ప్రస్తుతం దేశంలో 5.5 లక్షలకు పైగా 5జీ బేస్ స్టేషన్లు పనిచేస్తున్నాయి. 2022తో పోలిస్తే మొబైల్ ఇంటర్నెట్ వేగం 10 రెట్లు పెరిగింది" అని ప్రధాని వివరించారు. ఒక దశాబ్దం క్రితం దేశంలో 'డిజిటల్ విభజన' ఒక పెద్ద సవాలుగా ఉండేదని, కొత్త సాంకేతికత కొందరికే దక్కేదని మోదీ గుర్తుచేశారు. ఈ సమస్యను అధిగమించేందుకే 'డిజిటల్ ఇండియా' కార్యక్రమాన్ని ప్రారంభించామని, మొబైల్ ఫోన్‌ను కేంద్రంగా చేసుకుని డిజిటల్ సేవలను ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తెచ్చామని వివరించారు. భారతీయులకు టెలికాం అంటే కేవలం సాంకేతికత మాత్రమే కాదని, అంతకు మించి అని ఆయన అన్నారు. కోవిడ్ మహమ్మారి సమయంలో భారత డిజిటల్ వ్యవస్థ ప్రాముఖ్యతను ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో కార్యకలాపాలు స్తంభించిపోయినప్పుడు కూడా, మన దేశంలో కార్యాలయాలు, బ్యాంకులు, విద్యా సంస్థలు డిజిటల్ మౌలిక సదుపాయాల వల్లే నిరంతరాయంగా పనిచేయగలిగాయని గుర్తుచేశారు. ఈ ఏడాది ఐఎంసీ థీమ్ 'సరిహద్దులు లేని విస్తరణ' అని, ఇది భారత టెలికాం, డిజిటల్ మౌలిక ్దుపాయాల ప్రయాణాన్ని ప్రతిబింబిస్తుందని మోదీ అన్నారు. అక్టోబర్ 7 నుంచి 10 వరకు జరగనున్న ఈ సదస్సును టెలికమ్యూనికేషన్స్ విభాగం, సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఓఏఐ) సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరైన దేశ, విదేశీ టెలికాం ఆపరేటర్లు, పరిశ్రమల అధిపతులు, నిపుణులు, స్టార్టప్ ప్రతినిధులకు ప్రధాని స్వాగతం పలికారు.

# ఆ నలుగురికి కచ్చితంగా శిక్ష పడుతుంది




కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'ఇండియా' కూటమి ఢిల్లీలో చేపట్టిన నిరసనలు మూడో రోజుకు చేరుకున్నాయి. గురువారం సైతం విపక్ష ఎంపీలు తమ ఆందోళనను కొనసాగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "మోదీ, అమిత్ షా, మోహన్ భగవత్, జ్ఞానేశ్ కుమార్.. ఈ నలుగురూ కలిసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేందుకు కుట్ర పన్నుతున్నారు. వారికి కచ్చితంగా శిక్ష పడుతుంది, అది మీరే చూస్తారు. ఇది మా హామీ" అని రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము శాంతియుతంగా నిరసన తెలుపుతున్నప్పటికీ ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆయన ఆరోపించారు. "మొదటి రోజు మమ్మల్ని ఎన్నికల సంఘం కార్యాలయానికి వెళ్లకుండా అడ్డుకున్నారు. నిన్న జంతర్ మంతర్‌కు వెళ్లనివ్వలేదు. మా ఎంపీలపై దాడి చేశారు" అని ఆయన పేర్కొన్నారు. నిరసనల్లో భాగంగా విపక్ష ఎంపీలు తొలుత రాజ్‌ఘాట్ వద్ద నివాళు లర్పించారు. కాగా, ఈ అంశంపై తదుపరి కార్యాచరణకు కూటమి నేతలు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా శు క్రవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో విపక్ష ఎంపీలు భేటీ కానున్నారు. ఇందుకోసం ఇప్పటికే అపాయింట్‌మెంట్ తీసుకున్నారు. ఎన్నికల సంఘంపై వస్తున్న ఆరోపణల గురించి వారు రాష్ట్రపతికి వినతిపత్రం సమర్పించనున్నారు.

## బెంగాల్, బీహార్ తర్వాత తెలంగాణను టార్గెట్ చేస్తున్నారు

తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై ఏకంగా 92 లక్షల ఓట్లను తొలగించాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉండటానికి మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, ప్రజలు ఇప్పటికైనా మేల్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. లోక్‌భవన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మహేశ్ గౌడ్ మండిపడ్డారు. దేశవ్యాప్తంగా యథేచ్ఛగా ఓట్ల చోరీ జరుగుతోందని ఆరోపించారు. "బీహార్, పశ్చిమ బెంగాల్ తర్వాత ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం తెలంగాణను టార్గెట్ చేసింది. మోదీ, అమిత్ షా పాలనలో గత 12 ఏళ్లలో ప్రజలకు ఏమైనా మేలు జరిగిందా అని ఆలోచించుకోవాలి" అని ఆయన అన్నారు. తాము ప్రజాస్వామ్యబద్ధంగానే నిరసన తెలుపుతున్నామని స్పష్టం చేశారు.సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆయన్ను పదవి నుంచి తొలగించే వరకు తమ ఉద్యమం ఆగదని తేల్చి చెప్పారు. మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును దేశ ప్రజలు గమనిస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

### సీఈసీ, కమిషనర్ల నియామకాలు రద్దు చేయాలి..

దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్న తరుణంలో, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ నియామకానికి సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆయనతో పాటు మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్ల నియామకాలను సవాలు చేస్తూ సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి నియామకాలను రద్దు చేయాలని పిటిషనర్ కోరారు. ఎన్నికల కమిషనర్ల నియామకం ప్రక్రియకు సంబంధించి తీసుకువచ్చిన 2023 చట్టాన్ని సైతం ఈ పిటిషన్‌లో సవాలు చేశారు. ముఖ్యంగా కమిషనర్లను ఎంపిక చేసే కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని (సీజేఐ) తొలగించడాన్ని పిటిషనర్ తీవ్రంగా తప్పుబట్టారు. మరోవైపు, 'సర్' ప్రక్రియను రద్దు చేయాలని, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ పాల్గొన్నారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా ఒక్కటే తమ అంతిమ లక్ష్యం కాదని, ఆయన స్థానంలో మరొకరు వచ్చినా మార్పు ఉండదని, అందుకే ఆ వివాదాస్పద ప్రక్రియనే పూర్తిగా రద్దు చేయాలని నిరసనకారులు స్పష్టం చేశారు. ఎన్నికల వ్యవస్థలో సమూల ప్రక్షాళన జరగాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10వ తేదీ నుంచి సీజేపీ, వివిధ విద్యార్థి సంఘాలు సుదీర్ఘ పోరాటాలకు పిలుపునిచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఢిల్లీ అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా భారీగా పోలీసు, భద్రతా బలగాలను మోహరించేందుకు సిద్ధమవుతోంది.

## తెలంగాణలో మండుతున్న ఎండలు..

తెలంగాణలో ఎండల తీవ్రత మళ్లీ పెరుగుతోంది. నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ప్రారంభం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. పగటిపూట ఎండ ప్రతాపం, రాత్రివేళల్లో ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గురువారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో గరిష్ఠంగా 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డు కాగా, భద్రాచలం, మహబూబ్‌నగర్‌లలో 36.2 డిగ్రీలు, హైదరాబాద్‌లో 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించిది. రుతుపవనాల నిష్క్రమణ ప్రభావం వల్లే వాతావరణంలో ఈ మార్పులు చోటుచేసుకున్నాయని అధికారులు స్పష్టం చేశారు. రాష్ట్రం నుంచి నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని వాతావరణ కేంద్రం ప్రకటించింది.

## నాపై పోటీ చేసి గెలువు

ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉప ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ బహిరంగ సవాల్ విసిరారు. ఖైరతాబాద్‌లో తనపై పోటీ చేసి గెలవాలని, ఈ పోరులో తాడోపేడో తేల్చుకుందామని ఆయన వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో ఇండియా కూటమి చేపట్టిన 'సేవ్ డెమోక్రసీ' ర్యాలీలో దానం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉప ఎన్నికకు తాను పూర్తిగా సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. 'దానం నాగేందర్ అంటేనే ఒక బ్రాండ్' అని ధీమా వ్యక్తం చేసిన ఆయన, ఈ ఉప ఎన్నిక తమ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు ఒక రెఫరెండంగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ విధానానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలపైనా దానం స్పందించారు. ప్రజల ఓటు హక్కును కాలరాసే అధికారం ఎవరికీ లేదని, ఆ అధికారం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు ఎవరిచ్చారని ఆయన ప్రశ్నించారు. ఈ నిరసనలకు రాహుల్ గాంధీతో పాటు ఇండీ కూటమి నేతలు, యువత మద్దతుగా నిలుస్తున్నారని తెలిపారు.2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి గెలిచిన దానం నాగేందర్, ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరి సికింద్రాబాద్ నుంచి లోక్‌సభకు పోటీ చేశారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఆయనపై అనర్హత వేటు పడటంతో ఈ స్థానం ఖాళీ అయింది. ఈ నేపథ్యంలోనే జరగనున్న ఉప ఎన్నికలో విజయం సాధించి తీరుతామని దానం ధీమా వ్యక్తం చేశారు.

# డిజిటల్ సాంకేతికతను తరగతి బోధనతో అనుసంధానం చేయాలి





-ఖాన్ అకాడమీ వనరులను సమర్థవంతంగా వినియోగించి విద్యార్థుల అభ్యసన ఫలితాలు సాధించేలా కృషి చేయాలి

-విద్యార్థుల అభ్యసన పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలి

-శిక్షణలోని అంశాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకొని పాఠశాల స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలి

-డిజిటల్ అక్షరాస్యత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి, ప్రతినిధి అక్టోబర్ 8 ( తెలంగాణ పత్రిక )

డిజిటల్ సాంకేతికతను తరగతి బోధనతో అనుసంధానం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు పెద్దపల్లి జిల్లాలోని మదర్ థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న డిజిటల్ అక్షరాస్యత శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ, శిక్షణలో అందిస్తున్న అంశాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకొని, ఖాన్ అకాడమీ మార్గదర్శకాలకు అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన డిజిటల్ బోధన అందించాలని సూచించారు. శిక్షణలో నిర్దేశించిన అభ్యసన ఫలితాలనువిద్యార్థులు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రతి విద్యార్థి నిర్దేశిత అభ్యసన ఫలితాలను సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. ఖాన్ అకాడమీ అందించే డిజిటల్ వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ, విద్యార్థుల అభ్యసన స్థాయిని ఎప్పటికప్పుడు గుర్తించి, వారి పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. డిజిటల్ సాంకేతికతను తరగతి గది బోధనతో సమర్థవంతంగా అనుసంధానం చేయడం ద్వారా విద్యార్థుల్లో గణిత నైపుణ్యాలను మరింత మెరుగుపరచాలని తెలిపారు. విద్యార్థుల అభ్యసన అవసరాలకు అనుగుణంగా డిజిటల్ సాధనాలను వినియోగించి బోధనా ప్రక్రియను మరింత ప్రభావవంతంగా నిర్వహించాలని సూచించారు. శిక్షణలో అందించే అంశాలను ఉపాధ్యాయులు పూర్తిగా అవగాహన చేసుకొని, ఖాన్ అకాడమీ మార్గదర్శకాల ప్రకారం పాఠశాల స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. శిక్షణ ద్వారా పొందిన జ్ఞానం విద్యార్థుల అభ్యసనలో ప్రత్యక్షంగా ఉపయోగపడేలా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏయం ఓ డా. పి.ఎం. షేక్ పాల్గొని ఉపాధ్యాయులకు శిక్షణకు సంబంధించిన పలు అంశాలపై మార్గదర్శకత్వం అందించారు. శిక్షణలోని అంశాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకొని, వాటిని పాఠశాల స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని ఆయన సూచించారు. ఈ డిజిటల్ అక్షరాస్యత శిక్షణ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లాలోని 14 మండలాలకు చెందిన గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఖాన్ అకాడమీ మార్గదర్శకాల ప్రకారం శిక్షణను నాణ్యతతో అమలు చేసి, విద్యార్థుల్లో ఆశించిన అభ్యసన ఫలితాలను సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయనున్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, సంబంధిత అధికారులు, 14 మండలాలకు చెందిన గణిత ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# కల్లు విక్రయాలపై ఎక్సైజ్ అధికారుల ఉక్కుపాదం

-డిపోలపై ఈగల్ టీం దాడులు

కామారెడ్డి, అక్టోబర్ 8, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి జిల్లాలోని కల్లు డిపోలు, దుకాణాలపై ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలు వరుస దాడులు ముమ్మరం చేశాయి. కల్తీ కల్లు విక్రయాలు, నిబంధనల ఉల్లంఘనపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేపట్టారు. కామారెడ్డి పట్టణంలోని ప్రధాన కల్లు డిపో, దుకాణాలపై ఈగల్ టీం దాడి చేసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు డిపోలో సోదాలు నిర్వహించారు. కల్లు నిల్వలు, రవాణా రికార్డులు, లైసెన్స్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమతులకు మించి నిల్వలు ఉన్నాయా, కల్లులో రసాయనాలు కలుపుతున్నారా అనే కోణంలో ఆరా తీశారు. డిపో నుంచి కల్లు శాంపిల్స్ సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్ కు పంపినట్లు అధికారులు తెలిపారు. ల్యాబ్ రిపోర్ట్ ఆధారంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అక్టోబర్ 1 నుంచి కొత్త మామూలా (కొత్త వ్యాపారం) మొదలైన సందర్భంగా జిల్లాలోని పలు మండలాల్లో కల్తీ కల్లు విక్రయాలు జరుగుతున్నాయని, తాగిన వారికి ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దీంతో జిల్లా ఎక్సైజ్ శాఖ అప్రమత్తమైంది. ఇప్పటికే పలు కల్లు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి కేసులు నమోదు చేసినట్లు సమాచారం. నిబంధనలు ఉల్లంఘించి కల్తీ కల్లు విక్రయిస్తే లైసెన్స్ రద్దుతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఈ దాడులు కొనసాగుతాయని తెలిపారు. జిల్లాలో కల్తీకల్లు విచ్చలవిగా అమ్మకాల జరుగుతున్నాయని సమాచారంతోనే కళ్ళు డిపోలపై దాడులకు ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు దాడులు చేస్తున్నట్లు పలువురు భావిస్తున్నారు.

# ఆత్మహత్యల నివారణ సామాజిక బాధ్యత : రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్





-జీవితం జీవించడానికే - కష్టాలను ధైర్యంగా ఎదుర్కోవాలి

-నిలిచి గెలిస్తేనే ఘనత' పుస్తకావిష్కరణ

హైదరాబాద్, అక్టోబర్ 8 (తెలంగాణ పత్రిక):

ఆత్మహత్యల నివారణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సీవీ ఆనంద్ పిలుపునిచ్చారు. జీవితం జీవించడానికేనని, ఆత్మహత్యలకు పాల్పడవద్దని, కష్టాలు ఎదురైనప్పుడు ధైర్యంతో ఎదుర్కొని ముందుకు సాగాలని సూచించారు. గురువారం రాష్ట్ర పోలీసు కార్యాలయంలో ఆత్మహత్యల నివారణ కమిటీ గత సంవత్సర కాలంగా తెలంగాణ రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల్లో చేపట్టిన ఆత్మహత్యల నివారణ సదస్సుల సర్వే రిపోర్టును కమిటీ చైర్మన్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ డీజీపీకి అందజేశారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. స్వచ్ఛందంగా పోలీసు కుటుంబాలకు ఆత్మహత్యల నివారణ సదస్సులు నిర్వహించడం అభినందనీయమని, ఇకముందు కూడా మిగిలిన జిల్లాల్లో కొనసాగించాలని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ పరికిపండ్ల అశోక్ రచించిన 'నిలిచి గెలిస్తేనే ఘనత' పుస్తకాన్ని ఆవిష్కరించారు.

భరోసా నింపాలి: డాక్టర్ అశోక్

ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్ ఒ సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ.. ఆత్మహత్య ప్రయత్నం చేసుకునే వ్యక్తుల పట్ల సమాజం స్వాంతన చేకూర్చి మానసిక ధైర్యాన్ని నింపాలన్నారు. తనకు ఎవరూ లేరనే అగాధాన్ని పూడ్చే ప్రయత్నంతో భరోసా నింపాలని, కష్టాల్లో ఉన్న వ్యక్తికి తనకు ఉన్న అన్ని దారులు మూసుకుపోయినప్పుడే ఆత్మహత్య అనే దారి తెరుచుకుంటుందని, ఆ ప్రమాదకర క్షణంలో 'మేమున్నాము' అంటూ భరోసానిస్తే బయటపడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మహత్యల నివారణ కమిటీ సభ్యులు సుంకనపల్లి రాజేందర్, డాక్టర్ నోముల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# వాసవి పాఠశాల లో బతుకమ్మ సంబరాలు






తానూర్:08అక్టోబర్(తెలంగాణ పత్రిక)

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ అని మండల కేంద్రంలోని వాసవి పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్ పేర్కొన్నారు. గురువారం పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులు రంగురంగుల్లో పూలతో బతుకమ్మలను పేర్చి సాంప్రదాయ నృత్యాలు కోలాటాలు ఆడారు. అనంతరం స్థానిక చెరువులో బతుకమ్మ నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

## తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న మాజీ మంత్రివర్యులు మరియు తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్

కల్వకుర్తి ప్రతినిధి అక్టోబర్ 8 తెలంగాణ పత్రిక



మాజీ మంత్రివర్యులు సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మరియు తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి గారు తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శనం చేసుకున్నారు శ్రీవారి దర్శనం అనంతరం స్వామి వారి ఆశీస్సులు పొందారు శ్రీ వారి కృపతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు సుఖ సంతోషాలు కలగాలని ఆకాంక్షించారు.

## మొగిలిపాక యాదవ సంఘం భవనానికి రూ.5 లక్షల నిధులు

-ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో

-కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మామిడి సత్తిరెడ్డి ఆధ్వర్యంలో.



తెలంగాణ పత్రిక వలిగొండ మండలం అక్టోబరు 8.

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం మొగిలిపాక గ్రామంలో పెండింగ్‌లో ఉన్న యాదవ సంఘం భవన నిర్మాణ పనులకు రూ.5 లక్షల నిధులు మంజూరయ్యాయి. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవతో నిధులు మంజూరైనట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మామిడి సత్తిరెడ్డి రెడ్డి ఆధ్వర్యంలో నిధులను కాంట్రాక్టర్ గంట మురళికి అందజేసి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ సందీప్ రెడ్డి, జక్కుల ముత్యాలు, జక్కుల రాజమణి, జడిగే సబిత తదితరులు పాల్గొన్నారు. యాదవ సంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంపై గ్రామస్తులు, యాదవ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్

-ఉప్పల వెంకటేష్ సహకారంతో మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం: అందజేత



కల్వకుర్తి ప్రతినిధి అక్టోబర్ 8 తెలంగాణ పత్రిక

ఈరోజు కల్వకుర్తి నియోజ కవర్గం, కల్వకుర్తి మండలం లోని తిమ్మారాసిపల్లి చీమ్ముల పుల్లారెడ్డి గారు అనారోగ్యంతో మరణించడం జరిగింది. ఈ విషయాన్ని గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసు కున్న లిఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఒ మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ శ్రీ ఉప్పల వెంకటేష్ గారు మృతుడి కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎతీం కంటెంట్ అభ్యర్థి తుప్పల సిరియల్, శ్రీరామ్, కనికళ్ల కుమార్, పానగంటి పర్శరాములు, ముచ్చింత మాధవవులు, చీముల వెంకటరెడ్డి తీర్పత్ రెడ్డి, జజాల హుసేన్, పంచర్ షాప్ అంజి, తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలికుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్



కల్వకుర్తి ప్రతినిధి అక్టోబర్ 8 తెలంగాణ పత్రిక

రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి గ్రామానికి చెందిన మిన్నల ఎల్లమ్మ నిన్న రాత్రి మృతి చెందడం జరిగింది. ఉప్పల వెంకటేష్ ముఖ్య అనుచరుడు మోకురాల అశోక్ గౌడ్ ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి శ్రీ ఉప్పల వెంకటేష్ గారు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారి కుటుంబానికి 3000(మూడు వేల రూపాయలు) ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్‌లిసభ్యులు మోకురాల ఆంజనేయులు గౌడ్, ఎదుల శరత్ చంద్ర, ఎదుల అనిల్, బొంబాయి రాజు, రవి రాజు,బొర్ర వసంత్ కుమార్, మిన్నల గోపాల్ గ్రామ పెద్దలు నాయకులు తదితరులు పాల్గొన్నారు .

## రేపు ఉమ్మడి జిల్లా సీనియర్ ఖో ఖో జట్ల ఎంపిక




తెలంగాణ పత్రిక కరీంనగర్ అక్టోబర్ 8

కరీంనగర్ జిల్లా ఖో ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా (పెద్దపల్లి జిల్లా మినహా) సీనియర్ ఖో ఖో జట్ల ఎంపిక పోటీలను శనివారం నిర్వహించనున్నారు. మహిళలు, పురుషుల విభాగాలలో ఈ పోటీలను జిల్లా కేంద్రానికి సమీపంలోని రేకుర్తి ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ ( లయోలా ఇంగ్లీష్ మీడియం స్కూల్) లో ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్నామని జిల్లా ఖో ఖో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, వై మహేందర్ రావు, ఉపాధ్యక్షులు ఆర్ ఐ ఆఫ్ పోలీస్ కుమారస్వామి, డాక్టర్ ఏ రవీందర్ లు తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభ చాటే క్రీడాకారులను ఈనెల 29, 30, 31 నవంబర్ 1వ తేదీలలో నల్గొండలో నిర్వహించనున్న 59వ సీనియర్స్ తెలంగాణ రాష్ట్ర స్థాయి ఖో ఖో పోటీలకు ఎంపిక చేయనున్నామని పేర్కొన్నారు. ఈ పోటీలలో ప్రతిభ చాటే క్రీడాకారులను జిల్లా జట్టు ప్రాపబల్స్ కు ఎంపిక చేసి, శిక్షణ శిబిరం నిర్వహించనున్నామని పేర్కొన్నారు . శిబిరంలో తుది జట్లను ఎంపిక చేస్తామని వారు సూచించారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు తమ ఆధార్ కార్డు, జిరాక్స్ తో హాజరుకావాలని వారు సూచించారు.

## విద్యుత్తు సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే కు వినతి

కల్వకుర్తి ప్రతినిధి అక్టోబర్ 8 తెలంగాణ పత్రిక



తలకొండపల్లి మండలం పడకల్, లింగరావుపల్లి, రామకృష్ణపురం, దేవునిపడకల్, పెద్దూర్ తండా, వెంకటాపూర్ తండా గ్రామపంచాయతీలకు సంబంధించిన పడకల్ విద్యుత్తు ఉపకేంద్రానికి ఆల్వాల్ 132 కేవీ విద్యుత్తు కేంద్రం నుంచి సరఫరా అవుతుందని, లోడు ఎక్కువ కావడంతో తరచుగా ట్రిప్ అవుతుందని దీంతో సక్రమంగా విద్యుత్తు సరఫరా కావడం లేదని తలకొండపల్లి సింగిల్ విండో చైర్మన్ గట్ల కేశవరెడ్డి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి గారికి విన్నవించారు. చేతికొచ్చిన వరి పంటలు ఎండు తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. పడకల్ సబ్ స్టేషన్ కు ఆల్వాల్ నుంచి వచ్చే ఫిడర్ కు లోడు తగ్గించాలని కోరారు. నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేయాలని ఎమ్మెల్యే గారిని కోరారు.

**సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు ప్రారంభించాలని వినతి**

సీసీఐ నుంచి పత్తి కొనుగోళ్ల ను ప్రారంభించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి గారికి సింగిల్ విండో చైర్మన్ గట్ల కేశవ రెడ్డి కోరారు. మొదట పత్తి తీస్తున్న రైతులు దసరా ఖర్చుల కోసం సీసీఐ లేకపోవడంతో తక్కువ ధరలకు అమ్ముకుంటున్నారని వివరించారు. సీసీఐ కొనుగోలును త్వరగా ప్రారంభించాలని ఎమ్మెల్యే గారికి కేశవ రెడ్డి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా ముదిరాజ్, గూడూరు శ్రీనివాస్ రెడ్డి, కాకి కృష్ణ గారు పాల్గొన్నారు.

## కోటగిరి జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు



కోటగిరి తెలంగాణ పత్రిక అక్టోబర్ 08.

కోటగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మహిళ అధ్యాపకురాలు విద్యార్థినిలు రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి తెలంగాణ బతుకమ్మ అట పాటలతో విద్యార్థినిలు నృత్యం చేస్తూ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కైషర్ పాషా అధ్యాపకులు దత్తత్రి అనిల్ ప్రభాకర్ వెంకటేష్ ప్రమోద్ రాము శ్రీధర్ శ్రీలత శోభ విజయ కళాశాల సిబ్బంది విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఓపెన్ స్కూల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

-పరీక్షా కేంద్రాల్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలి
-విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి
-ప్రశ్నపత్రాలు, జవాబు పత్రాల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
-సంబంధిత జిల్లా అధికారులతో సమీక్షించిన అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు

పెద్దపల్లి,ప్రతినిధి అక్టోబర్ 8 ( తెలంగాణ పత్రిక )





తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో అక్టోబర్-2026లో నిర్వహించనున్న 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరే ట్‌లో తెలంగాణ ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణకు చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లపై సంబంధిత జిల్లా అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల్లో భద్రత, ప్రశ్నపత్రాల భద్రత, విద్యుత్ సరఫరా, వైద్య సేవలు, పారిశుద్ధ్యం, తాగునీరు, పరీక్షా సిబ్బంది, జవాబు పత్రాల తరలింపు తదితర అంశాలపై సమీక్షించారు.ఈసందర్భంగా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ తెలంగాణ ఓపెన్ స్కూల్ 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు.పరీక్షా కేంద్రాల్లో పటిష్టమైన భద్రతపె ద్దపల్లి పట్టణంలోని రెండు పరీక్షా కేంద్రాల వద్ద పరీక్షల సమయంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ సిబ్బంది, హోంగార్డులను బందోబస్తు విధుల్లో ఏర్పాటు చేయాలని సూచించా రు. పరీక్షల నిర్వహణ సమయంలో పరీక్షా కేంద్రాల వద్ద 144 సీఆర్‌పీసీ అమలు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పరీక్షల పర్యవేక్షణకు అవసరమైన సిట్టింగ్ స్క్వాడ్ అధికారులను నియమించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రశ్నపత్రాల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలను నిర్ణీత విధానంలో భద్రపరిచేందుకు పెద్దపల్లి పోలీస్ స్టేషన్ లో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రశ్నపత్రాలను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రంగా ఉంచి, పరీక్షల షెడ్యూల్ ప్రకారం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ల ద్వారా పరీక్షా కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షలు పూర్తయిన అనంతరం జవాబు పత్రాలను సీల్ చేసిన బండిళ్ల రూపంలో ప్రతిరోజు సురక్షితంగా పోస్టల్ శాఖకు అప్పగించి, నిర్ణీత విధానంలో పంపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్, వైద్య సేవలు అందుబాటులో ఉండాలి పరీక్షా సమయాల్లో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టా లని టీజీ ఎన్‌పీడీసీఎల్ అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు.పరీక్షా కేంద్రాల్లో విద్యార్థుల కు అవసరమైన ప్రథమ చికిత్స అందించేందుకు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగించేందుకు అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లను కూడా సిద్ధంగా ఉంచాలని సూచించారు. పారిశుద్ధ్యం, తాగునీటి ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, పరీక్షా కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అదనపు కలెక్టర్ సూచించారు. పరీక్షలకు ముందు పరీక్షా గదుల్లో క్రిమిసంహారక ద్రావణాన్ని స్ప్రే చేయించాల ని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ప్రతి పరీక్షకు ముందు పరీక్షా కేంద్రాల లోపల, బయట పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, విద్యార్థులకు సురక్షితమైన తాగునీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు.పరీక్షా సిబ్బందికి సహకారం అందిం చాలి పరీక్షల నిర్వహణకు అవసరమైన సిబ్బంది కొరత ఉంటే సంబంధిత జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమన్వయం చేసుకుని సిబ్బందిని సమకూర్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంటర్మీ డియట్ విద్యాశాఖ అధికారులను ఆదేశించా రు.పెద్దపల్లి పట్టణంలోని జెడ్‌పీహెచ్ఎస్ బాలికల, జెడ్‌పీహెచ్ఎస్ బాలుర పాఠశాలల్లో తెలంగాణ ఓపెన్ స్కూల్ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.తెలంగాణ ఓపెన్ స్కూల్ 10వ తరగతి, ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు అక్టోబర్ 11 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించ నున్నారు. అక్టోబర్ 11న వృత్తి విద్యా కోర్సులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించనుండగా, అక్టోబ ర్ 12 నుంచి 17వ తేదీ వరకు ప్రధాన పరీక్షలు కొనసాగనున్నాయి.ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు అక్టోబర్ 23 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించ నున్నట్లు అధికారులు తెలిపారు.పరీక్షలను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా, ఎలాంటి లోటుపా ట్లు లేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికా రులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో ఇంటర్మీ డియట్ నోడల్ అధికారి కల్పన , జిల్లా 10వ తరగతి ఎగ్జామినేషన్ అధికారి రాంరెడ్డి, విద్యాశాఖ అధికారులు, పోలీస్, వైద్య, మున్సిపల్, విద్యుత్, పోస్టల్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమష్టి కృషి చేయాలి








-టీబీ లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వెంటనే పరీక్షలు నిర్వహించాలి
-టీబీ రోగులకు నిరంతర పర్యవేక్షణతో పూర్తి స్థాయిలో చికిత్స అందేలా చూడాలి
-టీబీ ముక్త్ భారత్‌లో భాగంగా ఎంపికైన 80 టీబీ ముక్త్ గ్రామాలకు సర్టిఫికెట్ల పంపిణి చేసిన అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు

పెద్దపల్లి,ప్రతినిధి అక్టోబర్8 ( తెలంగాణ పత్రిక )

టీబీ వ్యాధి నిర్మూలనకు సమష్టి కృషి చేస్తూ జిల్లాను టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు అన్నారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఎంపికైన 80 టీబీ ముక్త్ గ్రామాలకు అదనపు కలెక్టర్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా టీబీ వ్యాధి నియంత్రణ, అనుమానిత కేసుల గుర్తింపు, పరీక్షలు, చికిత్స, ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ,టీబీ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. టీబీ లక్షణాలు ఉన్న వారిని క్షేత్రస్థాయిలో గుర్తించి వెంటనే పరీక్షలు నిర్వహించేలా వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది చర్యలు చేపట్టాలని సూచించారు.రెండు వారాలకు మించి దగ్గు ఉండటం, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, రాత్రివేళల్లో చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉన్న వారు నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకునేలా ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు.టీబీ రోగులకు పూర్తి స్థాయిలో చికిత్స టీబీ నిర్ధారణ అయిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు, మందులు సకాలంలో అందేలా చూడాలని అదనపు కలెక్టర్ సూచించారు. రోగులు చికిత్సను మధ్యలో నిలిపివేయకుండా, వైద్యుల సూచనల మేరకు పూర్తిస్థాయిలో మందులు వినియోగించేలా ఆరోగ్య సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. టీబీ రోగుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన పరీక్షలు నిర్వహించి, చికిత్స పూర్తయ్యే వరకు వైద్య సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. 80 గ్రామాలను టీబీ ముక్త్ గ్రామాలుగా ఎంపిక చేయడం అభినందనీ యంటీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 80 గ్రామాలు టీబీ ముక్త్ గ్రామాలుగా ఎంపిక కావడం అభినందనీయమని అదనపు కలెక్టర్ అన్నారు. ఈ గ్రామాల్లో చేపట్టిన చర్యలను స్ఫూర్తిగా తీసుకుని జిల్లాలోని మిగిలిన గ్రామాలను కూడా టీబీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు.గ్రామస్థాయిలో ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధుల సమన్వయంతో టీబీ అనుమానితులను గుర్తించి పరీక్షలకు పంపించాలని తెలిపారు. టీబీపై ఉన్న అపోహలను తొలగించి, వ్యాధి నిర్ధారణ అయిన వారికి కుటుంబ సభ్యులు, సమాజం నుంచి సహకా రం అందేలా అవగాహన కల్పించాలని సూచించారు. టీబీ నిర్మూలనపై విస్తృత అవగాహనటీబీ వ్యాధి నివారణ, లక్షణాలు, చికిత్స, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రతి గ్రామంలో ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. టీబీ రహిత గ్రామాలుగా ఎంపికైన గ్రామాల్లో ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ భవిష్యత్తులో కూడా కొత్త కేసులను ముందుగానే గుర్తించడం, చికిత్స అందించడం, వ్యాధి వ్యాప్తిని అరికట్టడం వంటి చర్యలను నిరంతరం కొనసాగించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ వై. పవిత్ర, జిల్లా టీబీ నియంత్రణ విభాగం అధికారి కె. వి.సుధాకర్ రెడ్డి, రాష్ట్ర రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు రాజగోపాల్ , వైద్య సిబ్బంది, వివిధ మండలాల ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రటరీలు, టీబీ రహిత గ్రామాల సర్పంచులు, సంబంధిత శాఖల అధికారు లు తదితరులు పాల్గొన్నారు.

# స్థలమున్న ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలి

కోటగిరి తెలంగాణ పత్రిక అక్టోబర్ 08.





కోటగిరి మండల కేంద్రంలో సిపిఐ పార్టీ మండల సమావేశాన్ని నల్ల గంగాధర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై. ఓమయ్య, బాన్సువాడ నియోజకవర్గ ఇన్చార్జి దుబాస్ రాములు హాజరైనారు. ఈ సమావేశం సందర్భంగా వారు మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు స్థలం ఉండి అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి నిర్మాణం చేపట్టి ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. నేటి వరకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మరచి కాలయాపన చేస్తున్నార న్నారు. ఆన్లైన్ సమస్య ఉందని మొదటి విడతలో ఇందిరమ్మ ఇల్లు మంజూరై నిర్మాణం చేయనటువంటి లబ్ధిదారుల స్థానంలో స్థలాలు ఉన్నటువంటి నిరు పేద కుటుంబాల లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించి, నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఆన్లైన్ సమస్యను పరిష్కరిస్తూ ఎలాంటి షరతులు లేకుండా ఇండ్లను మంజూరు చేసి, నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నామ న్నారు. లేనియెడల సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కొట్టేప్రసాద్ ,నీలి శంకర్, చిత్తరి శ్రీనివాస్, పంది మొక్కుల సాయిలు, గుంటి సాయిలు, కప్ప సాయిలు, లలిత, పోషవ్వ, లక్ష్మి గ్రామ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కుపై దాడిని తిప్పికొడదాం

-రాజ్యాంగ వ్యవస్థల రక్షణకు సమిష్టిగా పోరాడాలి
-'సర్' ప్రక్రియ వెనుక కుట్రలను బహిర్గతం చేయాలి
-ఎన్నికల కమిషనర్‌ను భర్తరఫ్ చేయాలి: సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా

కొత్తగూడెం, అక్టోబర్ 08 తెలంగాణ పత్రిక:



ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేసే పాలకుల అణచివేత చర్యలను ప్రజాతంత్ర శక్తులు ఐక్యంగా తిప్పికొట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా పిలుపునిచ్చారు. పౌరుల ప్రాథమిక హక్కులను కాలరాసే చర్యలను చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. 'సర్' ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని, ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను భర్తరఫ్ చేయాలని, అక్రమంగా తొలగించిన అర్హులైన ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్, న్యూ డిమోక్రసీ, మాస్ లైన్, జనసమితి పార్టీల ఆధ్వర్యంలో గురువారం కొత్తగూడెంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఓల్డ్ డిపో సెంటర్ నుంచి ప్రారంభమైన ప్రజాస్వామ్య పరిరక్షణ పాదయాత్ర రైల్వే స్టేషన్ సెంటర్ వరకు కొనసాగింది. అనంతరం అక్కడ నిర్వహించిన బహిరంగ సభలో సాబీర్ పాషా ప్రసంగించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును హరించే విధంగా 'సర్' ప్రక్రియ కొనసాగుతోందని ఆయన ఆరోపించారు. వివాదం సుప్రీంకోర్టు పరిధిలో ఉన్న సమయంలో ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం గర్హనీయమన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగిస్తే వారి ఓటు హక్కును పునరుద్ధరించే వరకు రాజీలేని ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. శ్రమజీవులు, పీడిత ప్రజల కనీస రాజకీయ హక్కైన ఓటును హరించే కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

**ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి**

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దేవి లక్ష్మి ప్రసన్న మాట్లాడుతూ ఓటు హక్కును నిర్వీర్యం చేసే కుట్రలను ప్రజాతంత్ర శక్తులు ఐక్యంగా ఎదుర్కోవాలని అన్నారు. చట్టబద్ధమైన నిబంధనలను పాటించకుండా ఏకపక్షంగా చేపట్టిన 'సర్' ప్రక్రియపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికల వ్యవస్థ నిష్పాక్షికతను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిష్పాక్షికంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లను అక్రమంగా జాబితాల నుంచి తొలగించడం ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే చర్య అని విమర్శించారు. మేయర్ మూడ్ గణేష్, మాస్ లైన్, న్యూ డిమోక్రసీ, జనసమితి నాయకులు కెచ్చల రంగారెడ్డి, గౌని నాగేశ్వర్ రావు, కవిత, దేవదానం మాట్లాడుతూ సాంకేతికత పేరుతో సామాన్య పౌరుల ఓట్లు గల్లంతు చేయడం ప్రజాస్వామ్య హక్కులకు భంగం కలిగించడమేనన్నారు. సుప్రీంకోర్టు పరిధిలో ఉన్న అంశాలపై న్యాయస్థాన నిర్ణయాలను గౌరవిస్తూ ముందుకు సాగాలని కోరారు. ఓటర్ల జాబితాలో అక్రమంగా తొలగించిన ప్రతి ఒక్కరి ఓటును పునరుద్ధరించే వరకు ప్రజా ఉద్యమాలను ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నాగ సీతారాములు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, సిపిఎం రాష్ట్ర నాయకులు ఏజే రమేష్, సిపిఐ జిల్లా నాయకులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, కమటం వెంకటేశ్వరరావు, జి.వీరాస్వామి, ఉప్పుశెట్టి రాహుల్, ఎస్కే ఫహీమ్, ఎంఎల్ పార్టీల జిల్లా నాయకులు ముద్దా బిక్షం, తుపాకుల నాగేశ్వరరావుతో పాటు అన్నవరపు సత్యనారాయణ, బ్రహ్మచారి, భూక్యా రమేష్, కొత్వాల శ్రీను, సిరిపురపు లలిత, మండే హన్మంతరావు, ఆళ్ల మురళి, ఉమర్, సీతారామయ్య, సారంగపాణి, జాటోత్ కృష్ణ, గోపాలరావు, అమర్లపూడి రాము తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల దాహం తీర్చిన దాత

-పాఠశాలకు వాటర్ ప్యూరి ఫైయర్ అందజేత
-దాత అంబిరి సతీష్ రావును సత్కరించిన సర్పంచ్, పాఠశాల ఉపాధ్యాయులు

పాపన్నపేట, అక్టోబర్ 08:(తెలంగాణ పత్రిక)



మండల పరిధిలోని కుర్తివాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన అంబిరి సతీష్ రావు పాఠశాలకు వాటర్ ప్యూరీ ఫైయర్ అందజేశారు. దీంతో విద్యార్థులకు తాగునీటి సమస్య కొంతవరకు పరిష్కారం కానుంది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చెట్టు కింది శ్రీధర్, పాఠశాల ఉపాధ్యాయులు అంబిరి సతీష్ రావును శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందించారు. పాఠశాలకు అవసరమైన సదుపాయం అందించిన దాతను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తాత అందించిన సహాయం పాఠశాల విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అంగిరి సతీష్ రావు చేసిన సహాయానికి పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సురక్షితమైన తాగునీరు అందుబాటులోకి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పాఠశాలలో నీటి సౌకర్యం మరింత మెరుగుపడేందుకు ఈ నీటి సదుపాయం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

# గ్రామపంచాయతీ రికార్డులను తనిఖీ చేసిన :ఎంపిఓ అమీర్ ఖాన్



తానూర్: 08అక్టోబర్ (తెలంగాణ పత్రిక)

మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ రికార్డులను గు రువారం ఎం పి ఓ అమీర్ ఖాన్ తనిఖీ చేశారు గ్రామప ంచాయతీ పరిధిలో ఎక్కడ కూడా నీటి నిల్వలు ఉండకు ండా తగిన చర్యలు చేపట్టా లని పంచాయతీ కార్యదర్శి షఫీ సూచించారు అదేవిధంగా పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్యం,మురికి కాలువలలో బ్లీచింగ్ పౌడర్ వేసి అంటువ్యాధులు ప్రబలకుండా శుభ్రపరచడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే గ్రామపంచాయతీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని అన్నారు .ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది,ఉన్నారు.

# అటవీ--వన్యప్రాణుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకం

-వన్యప్రాణుల రక్షణకు ప్రత్యేక చర్యలు ఏటూరునాగారం
-ఎఫ్ ఆర్ వో రెహమాన్.

తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది అక్టోబరు 08:.





అటవీ, వన్యప్రాణుల సంరక్షణలో ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, మేధావులు, రాజకీయ నాయకులు, మీడియా ప్రతినిధులు చురుకైన భాగస్వామ్యం కావాలని అటవీశాఖ అధికారులు పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాలంటే అడవులను, వన్యప్రాణులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ములుగు జిల్లా విస్తారమైన అటవీ ప్రాంతానికి ప్రసిద్ధి చెందిందని, జిల్లాలో సుమారు 87 శాతం మేర అటవీ ప్రాంతం ఉన్న నేపథ్యంలో ములుగును అడవుల జిల్లాగా పిలవడం సముచితమని అధికారులు తెలిపారు. అడవుల కారణంగానే ఈ ప్రాంతంలో ప్రకృతి సమతుల్యత, వర్షపాతం, సహజ సౌందర్యం కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అటవీ సంపద, సహజవనరులు, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలతో ముడిపడిన ప్రాంతంగా ఏటూరునాగారం ప్రత్యేక గుర్తింపు పొందిందని తెలిపారు. గిరిజన కుంభమేళా, లిపర్యాటక ప్రాంతాలు, వన్యప్రాణుల అభయారణ్యాలు, సహజ సౌందర్యం కారణంగా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు ఈ ప్రాంతాన్ని సందర్శిస్తున్నారని పేర్కొన్నారు.

**అక్రమ అటవీ ఆక్రమణలపై చర్యలు**

గత కొంతకాలంగా అటవీ ప్రాంతాల్లో జరిగిన అక్రమ ఆక్రమణలను గుర్తించి అటవీశాఖ చర్యలు చేపట్టిందని అధికారులు తెలిపారు. సుమారు 20,050 హెక్టార్ల మేర నష్టపోయిన అటవీ భూములను తిరిగి అటవీశాఖ ఆధీనంలోకి తీసుకునే చర్యలు చేపట్టినట్లు వివరించారు. అటవీ భూముల సంరక్షణలో భాగంగా కందకాలు తవ్వడం, రక్షణ చర్యలు చేపట్టడం జరిగిందని, రానున్న కాలంలో సుమారు 650 హెక్టార్లలో అటవీకరణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అడవులు క్రమంగా వెనక్కి వెళ్లకుండా వాటి విస్తీర్ణాన్ని పెంచే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

**వేటగాళ్ల నుంచి రక్షకులుగా మార్పు**

వన్యప్రాణులను వేటాడటం నేరమనే విషయంపై స్థానిక ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వేటకు ఉపయోగించే పరికరాలు, పనిముట్లను స్వాధీనం చేసుకునే చర్యలతో పాటు వేటగాళ్లకు అవగాహన కల్పించి వారిని వన్యప్రాణుల సంరక్షకులుగా మార్చే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. గత సంవత్సరంతో పోలిస్తే వేటకు సంబంధించిన పరికరాలు గణనీయంగా తగ్గాయని, దీనికి ప్రజలు, మీడియా అందించిన సహకారం ప్రధాన కారణమని అధికారులు పేర్కొన్నారు. రానున్న వన్యప్రాణుల వారోత్సవాల నాటికి వేటకు సంబంధించిన పరికరాలు పూర్తిగా కనిపించని స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు.

**ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు**

అభయారణ్యాలు, అటవీ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ప్లాస్టిక్ నిర్మూలన కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నామని పేర్కొన్నారు. చెరువులు, కుంటలు, వాగులు, వంకల్లో వన్యప్రాణులకు అవసరమైన నీటి వనరుల సంరక్షణకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అడవుల్లో ఆహారం, నీరు, సహజ వాతావరణం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. వన్యప్రాణుల రక్షణకు రహదారులపై ప్రత్యేక చర్యలు వన్యప్రాణులు రహదారులు దాటే ప్రాంతాల్లో వాహన ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. వాహనదారులకు ముందుగానే వన్యప్రాణుల సంచారం గురించి తెలిసేలా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కమలాపురం రోడ్డు నుంచి పెద్ద వెంకటాపూర్ వరకు, అలాగే ఏటూరునాగారం అభయారణ్య పరిధిలో వన్యప్రాణుల సంరక్షణకు అవసరమైన చర్యలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. వన్యప్రాణులపై అవగాహన అవసరం అడవుల్లో అనేక రకాల వన్యప్రాణులు, పక్షులు, అరుదైన జీవజాతులు ఉన్నాయని అధికారులు తెలిపారు. రసాయన ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగం, ప్లాస్టిక్ కాలుష్యం వల్ల పక్షులు, వన్యప్రాణులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవడంతో పాటు పక్షులు, వన్యప్రాణులు, ఔషధ మొక్కలు, సహజ వనరులను సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు, మీడియాకు కృతజ్ఞతలు అటవీ సంరక్షణ కార్యక్రమాలకు స్థానిక ప్రజలు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా అందిస్తున్న సహకారం అభినందనీయమని అధికారులు పేర్కొన్నారు. అటవీశాఖ చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణ ఒక్క అటవీశాఖ బాధ్యత మాత్రమే కాదని, ప్రజలు--అధికారులు--మీడియా--ప్రజాప్రతినిధులు కలిసి పనిచేసినప్పుడే అటవీ సంపదను భవిష్యత్ తరాలకు అందించగలమని అధికారులు స్పష్టం చేశారూ. సమాజం రెడీగా ఉంటే చెప్పండి మేము ముందుంటా వాళ్ళు విసిరి బాణానికి మేము ముందు ఉంటాం. మా దేహం మొక్కలైనా పర్వాలేదు అడవి ని ముక్కలు కాకుండా ప్రజల సహకారం కావాలి.పూర్తి గా అడవి కాపాడుకుందాం అన్నారు. ఈ కార్యక్రమం లో అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు

## దసరా వేళ ఇసుక లారీల రాకపోకలపై తాత్కాలిక ఆంక్షలు విధించాలి

-ప్రజల భద్రత దృష్ట్యా ఈ నెల 10 నుంచి 21 వరకు రాకపోకలు నిలిపివేయాలి: జ్వాలా చారిటబుల్ ట్రస్ట్

తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిధి అక్టోబరు 08:



తెలంగాణ రాష్ట్రంలో అత్యంత ఘనంగా జరుపుకునే దసరా నవరాత్రులు ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగపేట మండలంలో ఇసుక లారీల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేయాలని జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ డిమాండ్ చేసింది. దసరా పండుగ సందర్భంగా పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ఉండటంతో ప్రజలు కుటుంబాలతో కలిసి స్వగ్రామాలకు, ఇతర ప్రాంతాలకు పెద్ద సంఖ్యలో ప్రయాణించే అవకాశం ఉందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ప్రధాన రహదారులపై వాహనాల రద్దీ గణనీయంగా పెరిగే అవకాశం ఉందని, భారీ ఇసుక లారీల రాకపోకల వల్ల ప్రయాణికులకు ఇబ్బందులు, ప్రమాదాల ముప్పు ఏర్పడే అవకాశం ఉందని ట్రస్ట్ పేర్కొంది. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నెల 10వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఇసుక లారీల రాకపోకలను పూర్తిగా తాత్కాలికంగా నిలిపివేయాలని మండల ప్రజల నుంచి తమకు అనేక విన్నపాలు అందుతున్నాయని తెలిపింది. ప్రజల ఇబ్బందులు, ప్రయాణికుల భద్రతతో పాటు విలువైన ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత జిల్లా, మండల అధికారులు తక్షణమే స్పందించాలని జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ కోరింది. దసరా నవరాత్రులు ముగిసే వరకు ఇసుక లారీల రాకపోకలపై తాత్కాలిక ఆంక్షలు విధించి ప్రజలకు సురక్షితమైన ప్రయాణానికి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేసింది.

## పంటలను కాపాడుకుందాం.. దిగుబడులు పెంచుకుందాం

-ఆలూరులో పంటలను పరిశీలించిన పొలాస శాస్త్రవేత్తలు



రాయికల్ మండల్,తెలంగాణ పత్రిక, అక్టోబర్ 8:

పొలాస పరిశోధనా స్థానం దత్తత గ్రామమైన ఆలూరులోని పంట పొలాలు, కూరగాయల తోటలు, మామిడి తోటలను పొలాస శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా పంటల్లో కనిపిస్తున్న తెగుళ్ళ, పురుగుల నివారణకు రైతులకు పలు సూచనలు చేశారు.వరి పంటలో అగ్గి తెగులు నివారణకు టేబుకోనాజోల్ ం ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ 80 గ్రాములు ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. మిర్చి పంటలో కొమ్మవిరుపు తెగులు నివారణకు అజాక్సిస్ట్రోబిన్ ం డైఫెనకోనాజోల్ 200 మి.లీ.ఎకరానికి, త్రిప్స్ నివారణకు సైయంట్రానిలిప్రోల్ 300 మి.లీ. ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఎండ, మంచు కారణంగా పంటలకు ఎదురయ్యే సమస్యలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను కీటక శాస్త్రవేత్త డాక్టర్ స్వాతి రైతులకు వివరించారు. మామిడి తోటల్లో తేనెమంచు కారకాల నివారణకు ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ స్వాతి ముందస్తు చర్యలను సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ నల్లాల స్వామి, పీఏసీఎస్ చైర్మన్ దీటి రాజారెడ్డి, రైతులు మెక్కొండ రాంరెడ్డి, ఎలిపెద్ది రాజు, నల్లాల తిరుపతి, సతీష్, మల్లారెడ్డి, పెద్ద సాయన్న, గంగవ్వ, లావణ్య తదితరులు పాల్గొన్నారు..

### ఆమనగల్: పట్టణానికి చెందిన ప్రముఖ స్క్రాప్ వ్యాపారవేత్త

-కరీం భాయ్ బామ్మర్దుల వివాహ రిసెప్షన్ వేడుకను షాద్‌నగర్‌లోని రెడ్ రోజ్ ప్యాలెస్‌లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఆత్మీయుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు.

కల్వకుర్తి ప్రతినిధి అక్టోబర్ 8 తెలంగాణ పత్రిక



ఈ రిసెప్షన్ వేడుకకు ముఖ్య అతిథిగా ప్రముఖ సంఘ సేవకుడు, ఆర్యవైశ్య రాష్ట్ర నాయకులు కౌన్సిలర్ పాపిశెట్టి రామన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, "షాదీ ముబా రక్" అంటూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నూతన దంపతులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించాలని రామన్న గారు ఆకాంక్షించారు. అనంతరం కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించి, వివాహ వేడుక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రామన్న మిత్రమండలి సభ్యులు.. నూతనగంటి భాస్కర్ శ్రీను నాయక్ ప్రేమ్.మరియు హాజీ బాయ్. జానీల్. అబ్దుల్ మజార్. ఖలీల్. ముజాహిద్. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు , ఆత్మీయులు తదితరులు. పాల్గొన్నారు

## మీ ప్రమాణం' యాప్ ద్వారా ఉద్యోగుల హాజరు నమోదు చేయాలి






-జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్. మహేందర్ జి

తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది అక్టోబరు 08:

ప్రభుత్వ ఉద్యోగుల సమయపాలన, పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు ప్రవేశపెట్టిన 'మీ ప్రమాణం' యాప్ ద్వారా అధికారులు, సిబ్బంది హాజరు నమోదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్. మహేందర్ జి సూచించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో 'మీ ప్రమాణం' యాప్ వినియోగంపై వివిధ శాఖల నోడల్ అధికారులు, ఉద్యోగులకు జిల్లా అదనపు కలెక్టర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యాప్‌లో నమోదు, వినియోగించే విధానం, ముఖగుర్తింపు ద్వారా హాజరు నమోదు తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్. మహేందర్ జి మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను మరింత సమర్థంగా ప్రజలకు అందించేందుకు ఉద్యోగుల సమయపాలన కీలకమని తెలిపారు. జిల్లా స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు యాప్ వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రెగ్యులర్, కాంట్రాక్టు, పొరుగు సేవల ఉద్యోగుల వివరాల నమోదును సంబంధిత శాఖల నోడల్ అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఉద్యోగులు తమ చరవాణిలోని 'మీ ప్రమాణం' యాప్ ద్వారా ముఖగుర్తింపుతో హాజరు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఉద్యోగి గుర్తింపుతో పాటు హాజరు నమోదు చేసే ప్రదేశాన్ని ధ్రువీకరించే సదుపాయం ఈ యాప్‌లో ఉందని వివరించారు. కార్యాలయానికి వచ్చినప్పుడు, విధులు ముగించుకుని వెళ్లేటప్పుడు నిర్దేశిత విధానం ప్రకారం హాజరు నమోదు చేయాలని సూచించారు. ముఖగుర్తింపు, కార్యాలయ స్థాన నిర్ధారణ ద్వారా ఇతరుల తరఫున హాజరు నమోదు చేయడాన్ని నివారించేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని తెలిపారు. శాఖాధిపతులు తమ పరిధిలోని ఉద్యోగుల హాజరు వివరాలను పర్యవేక్షించేందుకు, హాజరు నివేదికలను పరిశీలించేందుకు యాప్‌లో సదుపాయాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఉద్యోగులు కార్యాలయ వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలను సకాలంలో అందించాలని సూచించారు. యాప్‌లో ఉద్యోగుల పేర్లు, ఉద్యోగ గుర్తింపు సంఖ్యలు, శాఖ, హోదా, చరవాణి సంఖ్య తదితర వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని తెలిపారు. నమోదు, ముఖగుర్తింపు, హాజరు నమోదులో సాంకేతిక సమస్యలు తలెత్తితే సంబంధిత నోడల్ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సందేహాల నివృత్తి కోసం 'మీ ప్రమాణం' యాప్ జిల్లా నోడల్ అధికారి, ఈడీఎం దేవేందర్‌ను సంప్రదించాలని తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నుంచి వచ్చిన సాంకేతిక బృందం ప్రతినిధులు యాప్‌లో నమోదు చేసుకునే విధానం, ముఖగుర్తింపు ద్వారా హాజరు నమోదు, కార్యాలయ స్థాన నిర్ధారణ తదితర అంశాలను వివరించి ఉద్యోగుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఐటీడీఏ ఎస్‌డీసీ ప్రతాప్, 'మీ ప్రమాణం' యాప్ నోడల్ అధికారి ఈడీఎం దేవేందర్, హైదరాబాద్ సాంకేతిక బృందం ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు, సంబంధిత అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ఆడపడుచుల ఆత్మగౌరవ ప్రతీక.. బతుకమ్మ

-జగిత్యాల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు.

జగిత్యాల జిల్లా,తెలంగాణ పత్రిక, అక్టోబర్ 8.



తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీకగా నిలుస్తుందని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి), జగిత్యాల ప్రిన్సిపాల్ ఆచార్య కె. రామకృష్ణ అన్నారు. కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణి ముఖ్య అతిథిగా, కళాశాల సి.పి.డి.సి. సెక్రటరీ డాక్టర్ జి. శ్రీలత విశిష్ట అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆచార్య కె. రామకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థినులు చదువుతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించి, ఆచరించడం మంచి సంప్రదాయమన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల జీవనశైలి, ప్రకృతితో వారి అనుబంధం, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో హాజరై, రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను తీసుకువచ్చారు. బతుకమ్మల చుట్టూ తిరుగుతూ సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా, ఉల్లాసంగా వేడుకల్లో పాల్గొన్నారు.కళాశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలను నిర్వహించి, విద్యార్థినుల్లో తెలంగాణ సంస్కృతి పట్ల అవగాహన, అభిమానం పెంపొందించేలా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన మహిళా సాధికారత విభాగం కన్వీనర్ డాక్టర్ యన్. వాసవి, స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ యన్. సంగీత రాణిలను ప్రిన్సిపాల్ అభినందించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి. ప్రమోద్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. చంద్రయ్య, అధ్యాపకులు ప్రొఫెసర్ వి. వరప్రసాద్, అకాడమిక్ కోఆర్డినేటర్ జి. రాం చంద్రమ్, తెలంగాణ స్కిల్ నాలెడ్జ్ సెంటర్ కోఆర్డినేటర్ కుమారి జి. నీరజ, జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ డి. సుజాత, చరిత్ర విభాగాధిపతి ఎస్. మల్లికార్జున్, డాక్టర్ జి. శ్రీలత, డాక్టర్ జమునతో పాటు ఇతర అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## టీబీ ముక్త్ భారత్‌లో భాగంగా డిండి మండలం లో నాలుగు గ్రామాలు ఎంపిక టీబీ ముక్త్ గ్రామాలకు సర్టిఫికెట్ల పంపిణి చేసిన నల్గొండ జిల్లా కలెక్టర్ చంద్ర శేఖర్

డిండి అక్టోబర్ 08 ( తెలంగాణ పత్రిక )



డిండి మండలం లో చెరుకుపల్లి ఖానాపూర్ బొగ్గులదోన జెత్యతండా గ్రామాలు ఎంపిక. టీబీ వ్యాధి నిర్మూలనకు సమష్టి కృషి చేస్తూ జిల్లాను టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ చంద్ర శేఖర్ అన్నారు.గురువారం జిల్లా కలెక్టరేట్‌లో టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఎంపికైన టీబీ ముక్త్ గ్రామాలకు కలెక్టర్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా టీబీ వ్యాధి నియంత్రణ, అనుమానిత కేసుల గుర్తింపు, పరీక్షలు, చికిత్స, ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ చంద్ర శేఖర్ మాట్లాడుతూ,టీబీ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. టీబీ లక్షణాలు ఉన్న వారిని క్షేత్రస్థాయిలో గుర్తించి వెంటనే పరీక్షలు నిర్వహించేలా వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది చర్యలు చేపట్టాలని సూచించారు.రెండు వారాలకు మించి దగ్గు ఉండటం, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, రాత్రివేళల్లో చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉన్న వారు నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకునేలా ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు.టీబీ రోగులకు పూర్తి స్థాయిలో చికిత్స టీబీ నిర్ధారణ అయిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు, మందులు సకాలంలో అందేలా చూడాలని కలెక్టర్ సూచించారు. రోగులు చికిత్సను మధ్యలో నిలిపివేయకుండా, వైద్యుల సూచనల మేరకు పూర్తిస్థాయిలో మందులు వినియోగించేలా ఆరోగ్య సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.టీబీ రోగుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన పరీక్షలు నిర్వహించి, చికిత్స పూర్తయ్యే వరకు వైద్య సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. ఈ గ్రామాల్లో చేపట్టిన చర్యలను స్ఫూర్తిగా తీసుకుని జిల్లాలోని మిగిలిన గ్రామాలను కూడా టీబీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు.గ్రామస్థాయిలో ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధుల సమన్వయంతో టీబీ అనుమానితులను గుర్తించి పరీక్షలకు పంపించాలని తెలిపారు. టీబీపై ఉన్న అపోహలను తొలగించి, వ్యాధి నిర్ధారణ అయిన వారికి కుటుంబ సభ్యులు, సమాజం నుంచి సహకారం అందేలా అవగాహన కల్పించాలని సూచించారు.టీబీ నిర్మూలనపై విస్తృత అవగాహనటీబీ వ్యాధి నివారణ, లక్షణాలు, చికిత్స, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రతి గ్రామంలో ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. టీబీ రహిత గ్రామాలుగా ఎంపికైన గ్రామాల్లో ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ భవిష్యత్తులో కూడా కొత్త కేసులను ముందుగానే గుర్తించడం, చికిత్స అందించడం, వ్యాధి వ్యాప్తిని అరికట్టడం వంటి చర్యలను నిరంతరం కొనసాగించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్ ,సర్పంచులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బహుజన రాజ్యాధికార సమరభేరి బహిరంగ సభను విజయవంతం చెయ్యాలి

-బీఎస్పీ తుర్కయంజాల్ అద్యక్షులు అద్వకేట్ పట్నం రమేష్ కురుమ

ఆదిభట్ల సర్కిల్ అక్టోబర్ 08 ( తెలంగాణ పత్రిక ):-

బహుజన రాజ్యాధికార సమరభేరి బహిరంగ సభను విజయవంతం చెయ్యాలి అని బీఎస్పీ తుర్కయంజాల్ అధ్యక్షులు అడ్వకేట్ పట్నం రమేష్ కురుమ అన్నారు.బహుజన రాజ్యాధికార బహిరంగ సభ ప్రచార కార్యక్రమంలో భాగంగా తుర్కయాంజాల్ అంబేద్కర్ చౌరస్తా వద్ద రోజువారి కూలీలను కలిసిమాట్లాడుతూ కనీస అవసరాలు కూడా కల్పించలేని పాలకులకు నిర్లక్ష్య ధోరణి తో ఉన్న అధికారుల మెడలు వంచాలంటే బహుజన్ సమాజ్ పార్టీ ఏనుగు గుర్తు కు ఓటు వేయాలని అన్నారు.స్వాతంత్రం వచ్చి 79 ఏండ్లు పూర్తి చేసుకొని 80వ ఏట అడుగుపెట్టిన రాజ్యాంగం అమల్లోకి వచ్చి 76 ఏండ్లు దాటినా ఇంకా దేశంలో వివక్ష కొనసాగుతూనే ఉన్నాయి అన్నారు.85-90 శాతం ఉన్న బీసీ,ఎస్సీ,ఎస్టీ మైనారిటీ ల శ్రమతో దేశ సంపద పెరుగుతుంటే అగ్రవర్ణాల మనువాదులు రాజకీయ అధికారాన్ని అనుభవిస్తూ బహుజనులను అనగతొక్కుతున్నారు అని రాష్ట్రంలోను దేశంలోను జరుగుతున్న దాడులకు హత్యలకు వ్యతిరేకంగా నేడు బడంగ్ పేట్ సిరిపురం యాదయ్య మున్సిపల్ గ్రౌండ్ లో సాయంత్రం 4




గంటలకు రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రామ్ శేఖర్ నాయకత్వంలో జరిగే బహిరంగ సభకు అందరూ వేలాది గా తరలి వచ్చి పాలకులకు రాబోయే ప్రభుత్వం మాదే అనే సంకేతం ఇద్దామని పిలుపునిఇచ్చారు.ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ తుర్కయంజాల్ ఉపాధ్యక్షులు లపంగి రాజు,ప్రధాన కార్యదర్శి మల్లెల రఘు,కోశాధికారి చెక్క రంజిత్ కుమార్,సీనియర్ నాయకులు భూతం రమణ తదితరులు పాల్గొన్నారు.

# యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలి





- జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, అక్టోబర్ 8 (తెలంగాణ పత్రిక):

జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామంలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని పనులు వేగంతో పాటు నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి ఇప్పటి వరకు పూర్తయిన పనులు ప్రస్తుతం కొనసాగుతున్న పనులు చేపట్టాల్సిన తదుపరి పనులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో ఎలాంటి జాప్యం లేకుండ కార్యాచరణ రూపొందించుకుని పనులను వేగవంతం చేయాలని సూచించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక మౌలిక వసతులు అందుబాటులోకి వచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. పాఠశాల భవన నిర్మాణంతో పాటు తరగతి గదులు విద్యార్థులకు అవసరమైన ఇతర సౌకర్యాలను ప్రణాళికాబద్ధంగా అన్ని ప్రమాణాలకు అనుగుణంగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్ ఎంపీడీఓలు మండల తహసీల్దార్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# త్రిశక్తి ఆలయానికి 55 కిలోల గంట విరాళం అందజేత

తెలంగాణ పత్రిక వలిగొండ మండలం అక్టోబర్ 08

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం శ్రీ విద్యాపురంలోని హరిహర త్రిశక్తి క్షేత్రం త్రిశక్తి ఆలయానికి 55 కిలోల బరువైన భారీ గంటను కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, అరూరు యాదవ సంఘం అధ్యక్షులు కీసరబోయిన లింగయ్య యాదవ్ దంపతులు విరాళంగా అందజేశారు. అరూరు గ్రామానికి చెందిన లింగయ్య యాదవ్, అరుణ దంపతులతో పాటు వారి కుటుంబ సభ్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి సేవలో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నామని లింగయ్య యాదవ్ తెలిపారు. ఆలయ అర్చకులు మాట్లాడుతూ ప్రాచీన ఆగమ సంప్రదాయాలను కాపాడేందుకు భక్తులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఆలయానికి 55 కిలోల గంటను సమర్పించడం భక్తి, ఆధ్యాత్మిక సేవకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. నైవేద్య సమయంలో ఘంటానాదం వినే భక్తులకు అమ్మవారి అనుగ్రహంతో సర్వమంగళాలు కలగాలని ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధికి



దాతలు అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులతో పాటు అర్చక బృందం, ఆలయ నిర్వాహకులు, చిరంజీవి మణినందన్, కుమారి రిషిక తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు నాణ్యమైన విద్యా అవకాశాలు కల్పించాలి






-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్ జిల్లా ప్రతినిధి (తెలంగాణ పత్రిక) 08 అక్టోబర్

జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రుల సమావేశం మెదక్‌లోని శ్రీ సాయి బాలాజీ గార్డెన్స్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వం అనేక రకాల సదుపాయాలను అందిస్తోందని తెలిపారు. అలిమ్కో క్యాంపుల ద్వారా అవసరమైన ఉపకరణాలను అందిస్తున్నామని, అలాగే ఎస్కార్ట్ అలవెన్స్, రీడర్ అలవెన్స్, ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ వంటి సహాయాలను అందిస్తున్నామని చెప్పారు. మెదక్ జిల్లాలోని 21 భవిత కేంద్రాల్లో 194 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. సాధారణ పాఠశాలకు వెళ్లలేని పిల్లలకు భవిత కేంద్రాల్లో అవసరమైన విద్యా సౌకర్యాలు కల్పిస్తున్నామని, లు వారికి విద్యాబోధన చేస్తున్నారని పేర్కొన్నారు. భవిత కేంద్రానికి కూడా రాలేని పిల్లల కోసం హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ ద్వారా ఐఈఆర్పి లు వారి ఇళ్లకు వెళ్లి విద్యాబోధన చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం 63 మంది పిల్లలకు ఈ విధంగా విద్య అందిస్తున్నట్లు చెప్పారు. భవిత కేంద్రాల్లో విద్యను అభ్యసించిన వారిలో ఇప్పటివరకు 46 మంది పిల్లలను తిరిగి సాధారణ పాఠశాలల్లోకి (మెయిన్‌స్ట్రీమింగ్) తీసుకువచ్చినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం జిల్లాలోని భవిత కేంద్రాల నిర్వహణకు గత సంవత్సరం ప్రభుత్వం రూ.1.06 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఈ నిధులతో జిల్లాలోని భవిత కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశం ప్రధాన ఉద్దేశం ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలపై ఐఈఆర్పి లు తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతో పాటు, తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ఓర్పుతో వ్యవహరించడం, వారికి అవసరమైన సహకారం అందించడం, వారి ప్రతిభను గుర్తించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేయాల్సిన బాధ్యతను వివరించడం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాజు, ఎ ఎమ్ ఓ సుదర్శన్ మూర్తి ,ఐ ఈడసిఎంఓ రాజు, ఎఎస్ఓ నవీన్,మురళీమోహన్, మెదక్ ఎంఇఓ శంకర్, జిల్లాలోని ప్రత్యేక విద్యా ఉపాధ్యాయులు, ఐఈఆర్పి లు, జిల్లా విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీంద్రరావుపై తప్పుడు వార్తలను ఖండించిన భూపతి శ్రీనివాసరావు

-ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీంద్రరావుపై తప్పుడు వార్తలను ఖండించిన భూపతి శ్రీనివాసరావు

కొత్తగూడెం, అక్టోబర్ 8 (తెలంగాణ పత్రిక):



తెలంగాణ ఉద్యమబిడ్డ, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీంద్రరావుపై గురువారం సామాజిక మాధ్యమాల్లో, కొన్ని వర్గాల్లో ప్రచారంలోకి వచ్చిన తప్పుడు వార్తా కథనాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ జిల్లా నాయకులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూపతి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సిద్ధాంతాలకు ఆకర్షితులై రవీంద్రరావు తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారని పేర్కొన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ అధ్యక్షుడిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తదితర కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని తెలిపారు. పార్టీ సమావేశాలు, వేదికలపై రవీంద్రరావు తీసుకునే నిర్ణయాలు పార్టీ బలోపేతం కోసమే ఉంటాయని, పార్టీ పట్ల నిబద్ధతతో, నీతి నిజాయితీలతో పనిచేసే నాయకుడిగా ఆయనకు మంచి గుర్తింపు ఉందని భూపతి శ్రీనివాసరావు అన్నారు. అలాంటి నాయకుడిపై ఆధారాలు లేని తప్పుడు వార్తా కథనాలను ప్రచారం చేయడం సరికాదన్నారు. కొంతమంది వ్యక్తులు సామాజిక మాధ్యమాల్లోని వివిధ గ్రూపుల ద్వారా తప్పుడు సమాచారాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలను వెంటనే నిలిపివేయాలని, లేకపోతే తగిన విధంగా స్పందించాల్సి వస్తుందని హెచ్చరించారు భూపతి శ్రీనివాసరావు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ జిల్లా నాయకులు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి.

# ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిపై దుష్ప్రచారం తగదు

-సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వారిని ఉపేక్షించొద్దు

-కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి

ఇబ్రహీంపట్నం అక్టోబర్ 08 ( తెలంగాణ పత్రిక):-



ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డిపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వారిని ఏమాత్రం ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకొని శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు.కలెక్టరేట్ వద్ద సమావేశం ముగించుకొని బయలుదేరుతున్న సమయంలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉచిత బస్సు పథకం గురించి మహిళల స్పందనను తెలుసుకోవడానికి ఆయన బస్సు ఎక్కారని,తన కూతురు లాంటి అమ్మాయితో చేయి పట్టుకొని ఆప్యాయతతో మాట్లాడితే సంస్కారం లేని నాయకులు ఎమ్మెల్యే పైన సోషల్ మీడియాలో విష ప్రచారం చేస్తున్నారని అన్నారు.దమ్ముంటే అభివృద్ధిపై ప్రశ్నించాలని రాజకీయ విమర్శ చేస్తే హుందాగా ఉండాలని ఇట్లా ఆడపిల్లల గౌరవాలకు భంగం కలిగించేలా ఉండొద్దని హితవు పలికారు.ప్రతీ మహిళను తన తల్లిలా,చెల్లిలా పలకరించే రంగారెడ్డి తన రాజకీయ జీవితంలో మహిళలకు అత్యంత ప్రధాన్యత ఇచ్చి గౌరవిస్తారని అన్నారు.గతంలో ఎన్నడూ లేని విధంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతుంటే తట్టుకోలేని బిఆర్ఎస్ నాయకులు కుళ్ళుతో విమర్శించడానికి ఎలాంటి అవకాశాలు లేకపోవడంతో ఇలాంటి దుష్ప్రచారాలు చేస్తున్నారని ఇలాంటి వారిని క్షమించి వదిలేస్తే సమాజానికి మంచిదికాదని మరోసారి ఆడపిల్లల గౌరవానికి భంగం కలిగేలా సోషల్ మీడియాలో వక్రీకరణలు చేయకుండా కఠినంగా శిక్షించాలని అన్నారు.

# ఇంటింటికి మొక్కలు పంపిణీ చేసిన కౌన్సిలర్ కొండ అరుణలక్ష్మణ్



జగిత్యాల, అక్టోబర్ 8 (తెలంగాణ పత్రిక):

జగిత్యాల పట్టణంలోని 48 వార్డు కౌన్సిలర్ కొండ అరుణలక్ష్మణ్ ఇంటింటికి వెళ్లి మొక్కలు పంపిణీ చేశారు. ప్రతి ఇంట్లో మొక్కలు నాటడం వలన ప్రకృతి ఆహ్లాదకరంగా పర్యావరణం కలుషితం కాకుండా ఉండాలంటే ప్రతి ఇంటికి మొక్కలను తప్పనిసరిగా మొక్కలు నాటాలని తెలిపారు. ఇది కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమమో లేదా స్వచ్ఛంద సంస్థల బాధ్యతో కాకుండ సమాజంలోని ప్రతి ఒక్కరి కర్తవ్యం అని అన్నారు. ప్రకృతిని కాపాడుకోవడానికి హరితహారాన్ని (పచ్చదనాన్ని) పెంపొందించడానికి ప్రతి ఇంటికి ఉచితంగా లేదా రాయితీపై మొక్కలను అందజేసే కార్యక్రమమే ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమం అని ఇందులో ప్రతి ఒక్కరు భాగస్వాములను కావాలని కొండ అరుణ లక్ష్మణ్ ఆకాంక్షించారు.

# ఒగ్గు బీర్ల కళాకారుల సంఘం ఏర్పాటు

– నూతన కార్యవర్గానికి పాపిశెట్టి రాము అభినందనలు



కల్వకుర్తి ప్రతినిధి అక్టోబర్ 8 తెలంగాణ పత్రిక

కల్వకుర్తి నియోజకవర్గ ఒగ్గు బీర్ల కళాకారుల సంఘాన్ని గురువారం ఆమనగల్లు పట్టణంలోని శుభం ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేశారు. సంఘం అధ్యక్షుడిగా బర్ల రమేష్, ఉపాధ్యక్షుడిగా సందం వెంకటేష్‌ను ఎన్నుకున్నారు. కల్వకుర్తి మండల అధ్యక్షుడిగా వస్పరి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడిగా రాచూరు యాదయ్య, ఆమనగల్లు మండల అధ్యక్షుడిగా మల్లేష్, ఉపాధ్యక్షుడిగా శ్రీశైలం, కడ్తాల్ మండల అధ్యక్షుడిగా శివ పడకల్, ఉపాధ్యక్షుడిగా పట్నం రామంజను ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కౌన్సిలర్ , ప్రముఖ సంఘ సేవకుడు పాపిశెట్టి రాము హాజరై నూతన కార్యవర్గాన్ని పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. కళాకారుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి సంఘం ఐక్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో లిరామన్న మిత్రమండలి సభ్యుడు శ్రీను నాయక్ మరియు బన్నె శివ, వెంకటయ్య, రాములు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# బాలన్నగూడెంలో సీసీ రోడ్లకు శంకుస్థాపన

-రూ.75 లక్షల నిధులతో రోడ్ల నిర్మాణం.. పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య



తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిధి అక్టోబరు 08:

మంగపేట మండలం బాలన్నగూడెం గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య గురువారం శంకుస్థాపన చేశారు. ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పైడాకుల అశోక్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క మంజూరు చేసిన సుమారు రూ.75 లక్షల నిధులతో గ్రామపంచాయతీ పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య మాట్లాడుతూ మంత్రి సీతక్క చొరవతో మారుమూల గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామాల్లో రహదారుల అభివృద్ధితో ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని తెలిపారు. మంజూరైన నిధులతో చేపట్టే సీసీ రోడ్ల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ, బ్లాక్ కాంగ్రెస్, మండల, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ మార్కెటింగ్ ప్రారంభించిన టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి



పాలకుర్తి అక్టోబర్08(తెలంగాణ పత్రిక):

పాలకుర్తి మండలం గూడూరు గ్రామంలో భూక్య వీరు వారి నూతనంగా ఏర్పాటుచేసిన సూపర్ మార్కెట్ ను ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ(టిపిసిసి)ఉపాధ్యక్షురాలు అనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి , అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలకు మంచి సేవలు అందించడానికి ముందుకు వచ్చిన షాపు యజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మార్కెట్ చైర్మన్ లావుడియా మంజుల భాస్కర్, ఆత్మ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగు శ్రీనివాస్,సర్పంచ్ మాచర్ల స్వరూప పుల్లయ్య, ఉప సర్పంచ్ కల్యాణ్ ,వార్డు మెంబర్లు విజయలక్ష్మి, పొన్నం మౌనిక, సునీత, నవిత, స్వప్న, నాగమణి, ప్రేమ్, రవి, గూడూరు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు లొంక ఐలయ్య . మాజీ ఎంపిటిసి బెల్లి దేవేందర్, మాజీ సర్పంచ్లు ఉప సర్పంచ్ లు , గ్రామ కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# గోదావరి పుష్కర ఘాట్లను సందర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్





బీరుపూర్, అక్టోబర్ 8 (తెలంగాణ పత్రిక):

జగిత్యాల జిల్లా బీర్పూర్ మండల్ గోదావరి పుష్కరాల నేపథ్యంలో బీర్పూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పర్యటించారు. రంగసాగర్ మంగేల కమ్మనూర్ చిత్రవేణిగూడెం రేకులపల్లి గ్రామాల్లోని గోదావరినది పుష్కర ఘాట్లను సందర్శించి అక్కడ చేపట్టనున్న ఏర్పాట్లను పరిశీలించారు. హిందువులు పవిత్రంగా భావించే పుష్కరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఘాట్ల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండ అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. పారిశుద్ధ్యం తాగునీరు సీసీ రోడ్డు విద్యుత్ మరుగుదొడ్లు భద్రత తదితర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మంగెల ఆశ్రమ పాఠశాలలో విద్యారులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం బీర్పూర్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బీర్పూర్ మండలానికి చెందిన 20 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన 9 లక్షల 36 వేల విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. బీర్పూర్ మండల రైతుల వినతి మేరకు పంటలకు సాగు నీటి సరఫరా కోసం రోల్లవాగు ప్రాజెక్ట్ షెట్టర్లను ఎమ్మెల్యే ఓపెన్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రోల్లవాగు ప్రాజెక్ట్ పూర్తికి నిరంతరం కృషి చేస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వంలో 30 కోట్ల నిధులు కాంట్రాక్టర్ కు మంజూరు చేయటం జరిగిందని తెలిపారు. ముంపుకు గురవుతున్న 827 ఎకరాలు అటవీ భూమికి 827 ఎకరాలు రెవెన్యూ భూమి అటవీ శాఖ కు ఇవ్వడం జరిగిందని అన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారంతో త్వరితగతిన అటవీ అనుమతుల ప్రక్రియ జరుగుతుందని గుర్తు చేశారు. బీర్పూర్ ఘాట్ రోడ్డు డబల్ రోడ్డు మంజూరు అయిందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భీమేష్ తహసిల్దార్ సుజాత కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాళ్ళ రాంచందర్ రావు పార్టీ అధ్యక్షుడు నారపాక రమేష్ ప్యాక్స్ ఛైర్మన్ పోల్సాని నవీన్ రావు శ్రీ లక్ష్మి నరసింహ స్వామీ ఆలయ చైర్మన్ చీర్నేని శ్రీనివాస్ సర్పంచులు అర్షకోట రాజగోపాల్ రావు ఎడ్ల సృజన ఎనుమట్ల హరీశ్ పూడూరు శ్రీలత బోడ సాగర్ బనుక సతీష్ చల్ల వినోద రంగు లక్ష్మణ్ తోట శ్రీనివాస్ చిక్రశీ మారుతి కోనపెల్లి శేఖర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ పోలీస్ సేవకు గుర్తింపుగా ఎస్సై బాలస్వామికి ఎమ్మెల్యే జారె ఘన సన్మానం

–ఉత్తమ సేవా పథకం అందుకున్న సందర్భంగా అభినందనలు

తెలంగాణ పత్రిక దమ్మపేట అక్టోబర్ 8





దమ్మపేట: పోలీస్ శాఖలో విధి నిర్వహణలో అంకితభావం, సమర్థతతో సేవలందిస్తూ ఉత్తమ సేవా పథకాన్ని అందుకున్న దమ్మపేట అదనపు ఎస్సై డి. బాలస్వామిని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అభినందించి ఘనంగా సన్మానించారు. దమ్మపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, బాలస్వామిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు అందిస్తున్న సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. ఉత్తమ సేవా పథకం అందుకోవడం అభినందనీయమని, ఇదే స్ఫూర్తితో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎస్సై బాలస్వామి మాట్లాడుతూ తన సేవలను గుర్తించి అభినందించిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు మరింత అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొని ఎస్సై బాలస్వామికి అభినందనలు తెలిపారు.

# ఈవీఎం గోడౌన్ భద్రతను నిరంతరం పర్యవేక్షించాలి








-ఆర్డీవో కార్యాలయ ఆవరణలోని ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ అంకిత్.

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక అక్టోబర్ 8

కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం తనిఖీ చేశారు. భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈవీఎంలు, వీవీ ప్యాట్ల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ గోడౌన్‌లను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఈవీఎంల భద్రత అత్యంత కీలకమైన అంశమని, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. తనిఖీలో భాగంగా ఈవీఎంలు, వీవీ ప్యాట్లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. అనంతరం సీసీ కెమెరాల నియంత్రణ గదిని సందర్శించి కెమెరాల పనితీరు, రికార్డింగ్ వ్యవస్థ, విద్యుత్ బ్యాకప్, భద్రతా పర్యవేక్షణ ఏర్పాట్లను పరిశీలించారు. గోడౌన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు భద్రతా ఏర్పాట్ల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వరాదని సూచించారు. గోడౌన్ వద్ద విధులు నిర్వహించే భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, అనుమతి లేని వ్యక్తులను గోడౌన్‌లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని కలెక్టర్ ఆదేశించారు. భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఏవైనా లోపాలు గుర్తించిన వెంటనే సరిదిద్దే చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఈవీఎం గోడౌన్ తనిఖీ రిజిస్టర్లను పరిశీలించి సంతకం చేశారు. ఈ తనిఖీలో కొత్తగూడెం ఆర్డీవో మధు, ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, ఎన్నికల సిబ్బంది నవీన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# బీరుపూర్ రైతు వేదికలో నిర్వహించిన సర్వసభ సమావేశం

-రంగసాగర్ గ్రామ సర్పంచ్ బోడ సాగర్ పలు సమస్యలపై అధికారులకు విజ్ఞప్తి

బీరుపూర్, అక్టోబర్ 8 (తెలంగాణ పత్రిక):



జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలంలోని రైతు వేదికలు నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో రంగసాగర్ కండ్లపెల్లి చెర్లపెల్లి గ్రామ ప్రజలు విద్యార్థులు రైతులు ఎదుర్కొంటున్న పలు ప్రధాన సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని రంగాసాగర్ గ్రామ సర్పంచ్ బోడ సాగర్ సంబంధిత శాఖల అధికారులకు విజ్ఞప్తి చేశారు. గ్రామంలోని సమస్యలను పత్రిక ముఖంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. 1) పాఠశాలల వేళల్లో ఆర్టీసీ బస్సు సర్వీస్ నడపాలి. గ్రామం నుండి జగిత్యాల ఇతర ప్రాంతాలకు వెళ్లే స్కూల్ కాలేజీ విద్యార్థులు సాయంత్రం స్కూల్ ముగిసే సమయానికి బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సౌకర్యార్థం సాయంత్రం 4:30 గంటలకు జగిత్యాల నుండి బయలుదేరాలి తద్వారా విద్యార్థులు సకాలంలో సురక్షితంగా ఇళ్లకు చేరుకుంటారని కోరారు. 2) ప్రమాదకరంగా మారిన విద్యుత్ వైర్లను తొలగించాలి. గ్రామంలోని వీధుల్లో ఇండ్లపై నుండి వెళ్తున్న డ్యామేజ్ (పాడైపోయిన) విద్యుత్ వైర్లను కరెంట్ డిపార్ట్‌మెంట్ అధికారులు వెంటనే పరిశీలించి వాటి స్థానంలో కొత్త వైర్లను బిగించాలి. ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామ ప్రజలు భయాందోళనల మధ్య గడుపుతున్నారని అధికారులు నిర్లక్ష్యం వీడి తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. 3) రైతులకు వెంటనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు కనెక్షన్లు ఇవ్వాలని గ్రామంలో వ్యవసాయ బావుల కొరకు ఇప్పటికే డిడి కట్టుకున్న రైతులకు కరెంట్ అధికారులు ఆలస్యం చేయకుండ త్వరగా ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేసి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని ప్రస్తుతం ఊరిలో ఉన్న ఒకే ఒక్క ట్రాన్స్‌ఫార్మర్ పై విపరీతమైన లోడ్ పడుతోందని దీనివల్ల తరచూ కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. డిడి కట్టిన రైతులకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఇస్తే లోడ్ తగ్గి గ్రామంలో కరెంట్ సరఫరా సక్రమంగా ఉంటుందని స్పష్టం చేశారు. గ్రామ ప్రజలు రైతులు విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని సర్పంచ్ బోడ సాగర్ అధికారులను కోరారు.

# భూ రీ-సర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి





-భూ రీ-సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ అంకిత్.

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక అక్టోబర్ 8

జూలూరుపాడు మండలం నల్లబండ బోరు గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న భూ రీ-సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా భూ రీ-సర్వే పురోగతి, ఇప్పటివరకు చేపట్టిన సర్వే వివరాలు, గ్రామ సరిహద్దుల నిర్ధారణ తదితర అంశాలను సర్వే, రెవెన్యూ అధికారులు, తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. నల్లబండ బోరు గ్రామపంచాయతీ పరిధిలో మొత్తం 1,426 ఎకరాల భూమి ఉండగా, సుమారు 12.50 కిలోమీటర్ల మేర భూ రీ-సర్వే ప్రక్రియ చేపడుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. గ్రామ సరిహద్దులను నిర్ణయిస్తూ సర్వే ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలిపారు. భూ రీ-సర్వేను పకడ్బందీగా నిర్వహించి, భూముల వివరాలు కచ్చితంగా నమోదు చేయడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భూ రీ-సర్వే సందర్భంగా ప్రతి భూమికి సంబంధించిన వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డులతో సరిపోల్చి నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అవసరమైన సాంకేతిక పద్ధతులను వినియోగించాలని అధికారులను ఆదేశించారు. భూ సరిహద్దుల విషయంలో రైతులకు ఉన్న సందేహాలను క్షేత్రస్థాయిలోనే నివృత్తి చేయాలని సూచించారు. రీ-సర్వే పూర్తయిన అనంతరం భూములకు సంబంధించిన రికార్డులు మరింత స్పష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులకు భూ యాజమాన్యానికి సంబంధించిన సమస్యలు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని రెవెన్యూ, సర్వే అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలోని రైతులతో కలెక్టర్ మాట్లాడి భూ రీ-సర్వే వల్ల కలిగే ప్రయోజనాలు, వారి భూముల వివరాలు, సాగు చేస్తున్న పంటలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు భూక్యా పంతులు తనకు రెండు ఎకరాల భూమి ఉందని, అందులో ఒక ఎకరంలో పత్తి, మరో ఎకరంలో మిర్చి సాగు చేస్తున్నట్లు కలెక్టర్‌కు వివరించారు. తన కుమారులు తనను పట్టించుకోవడం లేదని, వృద్ధాప్య పింఛన్ కోసం ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నట్లు రైతు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులు వెంటనే దరఖాస్తును పరిశీలించి, అర్హత మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట జూలూరుపాడు తహసీల్దార్ శ్రీనివాస్, సర్వేయర్, సర్పంచ్ జి. సింధు, రైతులు, సర్వే సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం భద్రతకు పెద్దపీట





-స్వచ్ఛత హి సేవలో భాగంగా ఆరోగ్య శిబిరం సేఫ్టీ కిట్ల పంపిణీ

-మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణిశ్రీనివాస్

జగిత్యాల, అక్టోబర్ 8 (తెలంగాణ పత్రిక):

ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రతిరోజూ పట్టణ పరిశుభ్రత కోసం శ్రమించే పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం భద్రతకు జగిత్యాల మున్సిపాలిటీ పెద్దపీట వేసిందని స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా జగిత్యాల పట్టణంలోని పారిశుధ్య కార్మికుల కోసం ప్రత్యేకంగా ఆరోగ్య శిబిరం నిర్వహించడంతో పాటు సేఫ్టీ కిట్లు సబ్బులు నూనెలు తదితర అవసరమైన సామగ్రిని మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం భద్రతకు మున్సిపాలిటీ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. పట్టణ పరిశుభ్రత కోసం పారిశుధ్య కార్మికులు అందిస్తున్న సేవలు ఎంతో కీలకమైనవని వారు ఆరోగ్యంగా ఉంటేనే జగిత్యాల పట్టణం ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. పారిశుధ్య విధుల్లో భాగంగా మురుగు కాలువల్లో పని చేసేటప్పుడు రోడ్లను శుభ్రం చేసేటప్పుడు ఇన్ఫెక్షన్లు దుమ్ము తదితర వాటి నుంచి రక్షణ పొందేందుకు గ్లౌజులు మాస్కులు ఆప్రాన్లు వంటి రక్షణ పరికరాలను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. మున్సిపాలిటీ అందజేసిన సేఫ్టీ కిట్లను విధుల్లో సక్రమంగా ఉపయోగించుకోవాలని కోరారు. దసరా బతుకమ్మ పండుగల సందర్భంగా పారిశుధ్య కార్మికులకు జీతాలు అక్టోబర్ 18వ తేదీ లోపు తప్పనిసరిగా అందేలా కమిషనర్‌తో మాట్లాడినట్లు చైర్‌పర్సన్ తెలిపారు. మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. విధి నిర్వహణలో రక్షణ పరికరాలను సక్రమంగా వినియోగించాలని వైద్యులు సూచించిన ఆరోగ్య జాగ్రత్తలను పాటించాలని కార్మికులకు సూచించారు. పట్టణ పారిశుధ్య నిర్వహణలో కార్మికులు చేస్తున్న సేవలను అభినందిస్తూ వారికి అవసరమైన సహకారం అందించేందుకు మున్సిపాలిటీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మానపురి పవిత్ర సామల జమున సుంకేటి మమత అరవ లక్ష్మి రాగుల ప్రదీప్ వేముల శ్రీనివాస్ క్యాదసు నవీన్ చీటి లక్ష్మీనారాయణ వైద్యులు స్రవంతి జాషువ ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు శానిటరీ ఇన్స్పెక్టర్లు అధికారులు సిబ్బంది పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

# టిపిటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

-అధ్యక్ష, కార్యదర్శులుగా

వెంకటేశ్వర్లు,వెంకటనరసయ్య పాలకుర్తి, అక్టోబర్ 08 (తెలంగాణ పత్రిక):



పాలకుర్తి మండల కేంద్రములో టిపిటిఎఫ్ సర్వసభ్య సమావేశం వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించబడింది. ముఖ్యఅతిథిగా జిల్లా ఉపాధ్యక్షులు ఇమ్మడి అశోక్ హాజరైనారు. తదనంతరం మండల శాఖ నిర్వహించిన కార్యకలాపాలపై సమగ్ర నివేదిక ప్రధాన కార్యదర్శి పి.వెంకట్ నరసయ్య ప్రవేశపెట్టగా దానిపై చర్చ , సభ్యుల సూచనలు, సలహాలు అనంతరం సమావేశం ముగించ నైనది. ఈ సమావేశం నందు ఈ క్రింది తీర్మానాలను ప్రవేశపెట్టడం జరిగింది. ప్రభుత్వము పిఆర్సి నివేదికను వెంటనే తెప్పించుకుని అమలు చేయాలి. పెండింగ్ లో ఉన్న మూడు డి ఏ లను వెంటనే అమలు చేయాలి. రిటైర్ అయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన జిపిఎఫ్,జి ఎల్ ఐ సి గ్రాచుటీ,కమిటీ షన్ బకాయిలను వెంటనే చెల్లించాలి. ఉపాధ్యాయుల సర్వీసు రూల్స్ సమస్యను వెంటనే పరిష్కరించాలి. ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్స్ వెంటనే చేయాలి. తనంతరం జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్నికల అధికారి ఇమ్మడి అశోక్ అధ్యక్షతన మండల శాఖ ఎన్నికలు నిర్వహించడం జరిగింది. ఈ క్రింద పేర్కొన్న కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగింది. అధ్యక్షులుగా డి వెంకటేశ్వర్లు, జెడ్పిహెచ్ఎస్ బొమ్మెర. ప్రధాన కార్యదర్శి: పి వెంకట నరసయ్య ఎంపీపీ ఎస్ దర్దేపల్లి. ఉపాధ్యక్షులుగా ఏ దయాకర్ రెడ్డి జెడ్పిహెచ్ఎస్ గూడూర్, బి బాలాజీ జెడ్పిహెచ్ఎస్ వావిలాల, సిహెచ్ వెంకటయ్య ఎంపీపీ ఎస్ గూడూర్ కార్యదర్శులుగా ఎస్ బుచ్చయ్య ఎంపీపీ ఎస్ వల్మిడి, ఎండి.షాహి సుల్తానా ఎంపీపీ ఎస్ చెన్నూరు, ఎండి. యాకూబ్ పాషా జెడ్ పి హెచ్ ఎస్ బొమ్మెర, జిల్లా కౌన్సిలర్లు గా ఎస్. శేషగిరిరావు ఎంపీపీ ఎస్ పెద్ద తండ కె, ఏ.శ్రీనివాసులు ఎంపీపీ ఎస్ వల్మిడి. ఆడిట్ కమిటీ కన్వీనర్ గా పి రమేష్ గెజిటెడ్ హెడ్మాస్టర్ జెడ్పిహెచ్ఎస్ చెన్నూర్, అకాడమిక్ సెల్ కన్వీనర్: బి అంజయ్య గెజిటెడ్ హెడ్మాస్టర్ జెడ్ పి హెచ్ ఎస్ ముత్తారం, జీవో కమిటీ కన్వీనర్ : పి రమేష్ గెజిటెడ్ హెడ్మాస్టర్ జెడ్ పి హెచ్ ఎస్ తొర్రూరు ఎన్నికైనారు.

# అంగన్‌వాడీ టీచర్ల దరఖాస్తుల పరిశీలన

ముధోల్:08అక్టోబర్(తెలంగాణ పత్రిక)



ముధోల్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగ న్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ దరఖాస్తులను సీడీపీ వో రాజశ్రీ, సిబ్బంది గురువారం పరిశీలించారు. మండలంలోని ఎడ్ బిడ్, రాంటెక్, బ్రాహ్మణ గావ్ గ్రామాల్లో ఖాళీగా అంగన్వాడి టీచర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సమర్పించిన దరఖా స్తులు పరిశీలించారు. విద్యార్హ తలు,నివాస ధ్రువపత్రాలు,కుల ధ్రువపత్రాలు తదితర వివరాలను నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీ లిస్తున్నారు. అర్హత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న అభ్యర్థులను గుర్తించి తదుపరి నియామక ప్రక్రి యను పూర్తి చేస్తామని సిడిపివో తెలిపారు. దరఖాస్తుల పరిశీలనలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పారదర్శకంగా ప్రక్రియ కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు నుండి ప్రారంభమైన పరిశీలన సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది.

# నేడు సోమన్న ఆలయంలో హుండీ లెక్కింపు

పాలకుర్తి,అక్టోబర్08 (తెలంగాణ పత్రిక):



పాలకుర్తి మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన స్వయంభూ శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 9న శుక్రవారం ఉదయం 10:30 గంటలకు హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో భాగం లక్ష్మీ ప్రసన్న తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఆలయంలోని కళ్యాణ మండపంలో హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

# “ఉమ్మడి కరీంనగర్ జిల్లా వాలీబాల్ కోచ్ గా అజీమ్

తెలంగాణ పత్రిక కరీంనగర్ అక్టోబర్ 8



జగిత్యాల జిల్లా కండ్లపల్లి మోడల్ స్కూల్ కి చెందిన పి డి అజీమ్ ఈ నెల 09 నుండి 11 వరకు మహబూబ్‌నగర్ జిల్లా రంగారెడ్డిగూడ జడ్చర్ల లో జరుగనున్న ఎస్ జి ఎఫ్అండర్ 19 బాయ్స్ ఒ గర్ల్స్ వాలీబాల్ కి ఉమ్మడి కరీంనగర్ జిల్లా టీమ్ కి కోచ్ గా వ్యవహరించనున్నరు, అందుకు గాను కండ్లపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సరితాదేవి, వైస్ ప్రిన్సిపల్ నగేష్ మరియు ఉపాధ్యాయ బృందం అజీమ్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# సత్తక్కపల్లి అంగన్వాడీ భవన నిర్మాణానికి 12 లక్షలు మంజూరు

-కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కాలకుంట్ల సంజయ్

జగిత్యాల, అక్టోబర్ 8 (తెలంగాణ పత్రిక):



జగిత్యాల జిల్లా మెట్పల్లి మండలం సత్తక్కపల్లి గ్రామానికి అంగన్వాడి భవన నిర్మాణానికి 12 లక్షలు మంజూరు అయ్యాయని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ తెలిపారు. గ్రామస్థులు అంగన్వాడి భవనం ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వారి అభ్యర్థనకు వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయించారు. ఎమ్మెల్యే కృషితో నిధులు మంజూరు కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీ అక్షర పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు

ముధోల్:08అక్టోబర్(తెలంగాణ పత్రిక)



మండల కేంద్రంలోని శ్రీ అక్షర పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలను పాఠశాల యజమా న్యం, విద్యార్థులు అంగరంగ వైభవంగా గురువారం జరుపుకు న్నారు. ఈ సందర్భంగా విద్యార్థు లు రంగురంగుల తంగేడు, గునుక, బంతి పూలను సేకరించి బతుకమ్మను పాఠశాల ఆవరణ లో అందంగా పేర్చారు. విద్యార్థులు తెలంగాణ సాంప్రదాయాన్ని ఉట్టిపడేలా బతుకమ్మ పాటలతో కోలాటలు ఆడుతూ నృత్యాలు పలువురిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. దీంతో పాఠశాల డైరెక్టర్ జరీ కోట్ సుభాష్ మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృ తి సాంప్రదాయాలకు నిలయం బతుకమ్మ పండుగ అని అన్నారు. బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సాయికుమార్, ఉపాధ్యాయులు మధుసిందే, మహేందర్, సంతోష్, తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# నేడు గ్రామ సభల్లో ఎమ్మెల్యే పర్యటన

తానూర్:08అక్టోబర్(తెలంగాణ పత్రిక)

మండలంలోని పంజాబ్ భూముల అంశంపై శుక్రవారం పలు గ్రామాల్లో నిర్వహించనున్న గ్రామ సభలకు ఎమ్మెల్యే రామారావు పాటిల్ హాజరుకానున్నట్లు బిజెపి మండల అధ్యక్షుడు పూంద్ర లక్ష్మణ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మొగిలి, 11 గంటలకు మసాలా, మధ్యాహ్నం 12 గంటలకు ఎల్వి, 1 గంటకు ఝరి బి, 2 గంటలకు బేల్తరోడలో గ్రామ సభలో పాల్గొనున్నట్లు తెలిపారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

# రమేష్ గౌడ్ మృతి బాధాకరం

-టీపీసీసీ సభ్యులు మర్రి నిరంజన్ రెడ్డి
-20 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేత



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 08 (తెలంగాణ పత్రిక):-



ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు పండాల శివ కృష్ణ గౌడ్ నాన్న పండాల రమేష్ గౌడ్ మృతి బాధాకరం అని టీపీసీసీ సభ్యులు ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మన్, ఇబ్రహీంపట్నం మండల మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్ రెడ్డి అన్నారు.ఆయన మరణించిన విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకొని ఇబ్రహీంపట్నంలో వారి నివాసానికి విచ్చేసి రమేష్ గౌడ్ పార్ధివ దేహం పై పూలమాల వేసి,నివాళులర్పించి,తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి,కుటుంబ సభ్యులను ఓదార్చి 20 వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుంట్ల ఉదయపాల్ రెడ్డి,ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ నాయకులు పుట్ట సందీప్,పండాల సతీష్,ముత్యాల మహేష్,యాట శివ,సోప్పరి మహాదేవ,మహమ్మద్ అసద్,అమీర్,అబ్దుల్ కాలనీవాసులు కుటుంబ సభ్యులు బంధుమిత్రులు తదితరులు ఉన్నారు.

# 11 కేవీహెచ్‌టీ విద్యుత్ కనెక్షన్లకు ఏకరీతి సర్వీస్ లైన్

-వినియోగదారులకు మరింత పారదర్శకత వేగవంతమైన సేవలు
- ఎస్ఈ సుదర్శనం



జగిత్యాల, అక్టోబర్ 8 (తెలంగాణ పత్రిక):

తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి 11 కేవీ స్థాయిలో అర్హత కలిగిన హై టెన్షన్ విద్యుత్ కనెక్షన్లు అదనపు లోడ్లకు ఏకరీతి సర్వీస్ లైన్ ఛార్జీలను అమలు చేసే విధానం అందుబాటులోకి తీసుకొచ్చిందని జగిత్యాల సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ బి. సుదర్శనం తెలిపారు. నిబంధనలకు చేసిన మూడవ సవరణగా రెగ్యులేషన్ నం. 07 ఆఫ్ 2026 ను టిజి ఈఆర్సీ జారీ చేసిందన్నారు. ఈ సవరణ ద్వారా అర్హత కలిగిన 11 కేవీ ఎచ్.టి వినియోగదారులకు సర్వీస్ లైన్ ఛార్జీల విషయంలో స్పష్టమైన ఏకరీతి విధానం ద్వారా మెరుగైన సేవలు అందుతాయని అన్నారు. పారదర్శకత జవాబు దారీతనం సామర్థ్యం వినియోగదారుల కేంద్రిత సేవలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగదారులకు సులభతరమైన వేగవంతమైన విద్యుత్ సేవలు అందించే దిశగా నిరంతరం చర్యలు చేపడుతోందని వినియోగదారులకు మరింత స్పష్టత కొత్త నిబంధనల ప్రకారం ఇప్పటికే ఉన్న 11 కేవీ విద్యుదీకరించిన కామన్ ఫీడర్ నుంచి ఓవర్‌హెడ్ లైన్ ద్వారా 1 కిలోమీటర్ పరిధిలో ఉన్న 11 కేవీ ఎచ్.టి కొత్త కనెక్షన్లు అదనపు లోడ్లకు సరఫరా కల్పించుటకు ప్రతి కేవిఏ కాంట్రాక్టెడ్ డిమాండ్‌కు 4,078 సర్వీస్ లైన్ ఛార్జీ వర్తిస్తుందన్నారు. దీంతో అర్హత కలిగిన వినియోగదారులకు సర్వీస్ లైన్ వ్యయంపై ముందుగానే స్పష్టత లభించడంతో పాటు దరఖాస్తుల పరిశీలన ప్రాసెసింగ్‌లో మరింత ఏకరూపత ఏర్పడుతుందని వివరించారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంతో పాటు వినియోగదారులకు మరింత పారదర్శకమైన సమర్థవంతమైన సులభతరమైన సేవలు అందించడమే లక్ష్యంగా ఆధునిక సాంకేతికత వేగవంతమైన సేవల ద్వారా నాణ్యమైన విద్యుత్ సేవలను అందించేందుకు కృషి చేస్తున్నామని ఎస్ఈ సుదర్శనం తెలిపారు.

# అంగన్వాడీ, పాఠశాల, పల్లె దవాఖానల్లో పీఓ లెనిన్ వత్సల్ టోప్పో ఆకస్మిక తనిఖీలు







తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిధి అక్టోబరు 08:

ఏటూరునాగారం మండలంలో ప్రజలకు అందుతున్న విద్య, ఆరోగ్య సేవలను మరింత మెరుగుపరచడమే లక్ష్యంగా ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో ఆకస్మికంగా పలు ప్రభుత్వ సంస్థలను సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆకులవారి ఘనపూర్ అంగన్వాడీ కేంద్రం, జీపీ పాఠశాల, ఎటూరునాగారం సబ్ సెంటర్--1 (పల్లె దవాఖాన), సబ్ సెంటర్--2లను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు.

**అంగన్వాడీ కేంద్రం పరిశీలన**

ఆకులవారి ఘనపూర్ అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన పీఓ, చిన్నారుల హాజరు, రికార్డులు, అభ్యసన సామగ్రి, పోషకాహారం మరియు కేంద్రం నిర్వహణను పరిశీలించారు. చిన్నారులకు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని, బోధనా సామగ్రిని సమర్థవంతంగా వినియోగించాలని సిబ్బందికి సూచించారు.

**జీపీ పాఠశాలలో విద్యార్థుల అభ్యసనంపై పరిశీలన**

ఆకులవారి ఘనపూర్ జీపీ పాఠశాలలో తరగతి గదులను పరిశీలించిన పీఓ, విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి చదువు, అభ్యసన స్థాయి, పాఠ్యాంశాలపై అవగాహనను తెలుసుకున్నారు. విద్యార్థుల నోట్‌బుక్స్, అభ్యసన సామగ్రిని పరిశీలిం చారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని ఉపాధ్యాయులకు సూచించారు.

**పల్లె దవాఖాన, సబ్ సెంటర్లలో వైద్య సేవల తనిఖీ**

ఎటూరునాగారం సబ్ సెంటర్--1 (పల్లె దవాఖాన), సబ్ సెంటర్--2లను తనిఖీ చేసిన పీఓ, అక్కడ అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, మందుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, రోగుల వివరాల నమోదు, ఇతర రికార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బందితో మాట్లాడి ప్రజలకు అందుతున్న సేవలు, అవసరమైన మందుల లభ్యతపై వివరాలు తెలుసుకున్నారు. వైద్య పరికరాలు, ఓపీ సేవలు, రికార్డుల నిర్వహణను కూడా పరిశీలించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సమయానుకూలంగా నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూడాలని, అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పీఓ సూచించారు. ప్రభుత్వ విద్య, ఆరోగ్య సంస్థల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి విద్యార్థులు, చిన్నారులు, గ్రామీణ ప్రజలకు నాణ్యమైన సేవలు అందేలా చూడాలని పీఓ లెనిన్ వత్సల్ టోప్పో ఆదేశించారు.

# టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం







-టీబీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేలా ముందుకు వెళ్లాలి
-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
-టీబీ రహిత గ్రామాలుగా ఎంపికైన సర్పంచులు, వైద్య సిబ్బందికి సర్టిఫికెట్లు అందించి.. అభినందించిన జిల్లా కలెక్టర్
-20 మంది క్షయ బాధితులకు పోషణ కిట్ల పంపిణీ

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్, 08, తెలంగాణ పత్రిక.

టీబీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేలా వైద్య సిబ్బంది పక్కా కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు.టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆద్వర్యంలో సర్పంచులు, వైద్య సిబ్బందికి నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు.ఈ సందర్భంగా టీబీ లక్షణాలు, వైద్య పరీక్షలు, మందులు, పోషకాహారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేశారు.టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం కింద ఎంపికైన 20 గ్రామ పంచాయతీల సర్పంచులు, వైద్య సిబ్బందికి జిల్లా కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందించి.. అభినందించారు. మిగతా వైద్యులు, సిబ్బంది వీరిని ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని పిలుపు ఇచ్చారు. 20 మంది క్షయ బాధితులకు పోషకాహారం కిట్లు పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.టీబీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు వైద్య సిబ్బంది పక్కా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని ఆదేశించారు. టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని పిలుపు నిచ్చారు. టీబీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు.సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు, జిల్లాలోని అన్ని గ్రామాల్లో టీబీ లక్షణాలు ఉన్నవారిని గుర్తించాలని, వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించాలని పేర్కొన్నారు. టీబీ పేషంట్ల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వైద్యం, మందులు, ఆర్థిక సహాయం ఇప్పించాలని ఆదేశించారు. పూర్తిగా నయం అయ్యేవరకు క్షయ బాధితులపై పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు.ఎంపికైన అయిన గ్రామాలు ఇవే..బోయినపల్లి మండలం రామన్నపేట, దేశాయిపల్లి, శాభాష్ పల్లి, ఇల్లంతకుంట మండలం కిష్టారావుపల్లె, ఆరెపల్లి, గంభీరావుపేట మండలం హీరాలాల్ తండా, పొన్నాలపల్లి, కోనరావుపేట మండలం గొల్లపల్లి, శివంగాలపల్లి, మర్త న్నపేట, ముస్తాబాద్ మండలం గోపాలపల్లి, రుద్రంగి మండలం రూప్లానాయక్ తండా, సర్పంచ్ తండా, తంగళ్ళపల్లి మండలం పాపయ్యపల్లి, వీర్నపల్లి మండలం బాబాయి చెరువు తండా, బావు సింగ్ నాయక్ తండా, ఎర్రగడ్డ తండా, జవహర్ లాల్ నాయక్ తండా, వేములవాడ రూరల్ మండలం అచ్చన్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లి గ్రామాలు ఎంపికయ్యాయి.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, వైద్యులు, సర్పంచులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులకు నిరసనగా వినతిపత్రం

-తహశీల్దార్ కు కాంగ్రెస్ నాయకుల వినతి

తానూర్:అక్టోబర్08(తెలంగాణ పత్రిక)

ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలని కోరుతూ ఇండియా కూటమి ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకుని, కూటమి నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు గురువారం తానూర్‌లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేశ్‌కుమార్‌ను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం న్యాయం కోరుతూ పోరాడుతున్న ప్రతిపక్ష నాయకులను పోలీసులు దౌర్జన్యంగా అరెస్టు చేయడం సరికాదని నాయకులు అన్నారు. ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని కూడా చూడకుండా పోలీసులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారని ఆరోపించారు. అనంతరం జ్ఞానేశ్‌కుమార్‌ను వెంటనే తొలగించాలని నినాదాలు చేస్తూ తహశీల్దార్ మహేందర్‌నాథ్‌కు వినతిపత్రం అందజేశారు.

**తానూర్ మండలంను కరువు మండలంగా ప్రకటించాలి**

పంటలు ఎండిపోతున్నాయి.. పరిహారం అందించాలి ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది తానూర్ మండలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక పంటలు ఎండిపోతున్నాయని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులకు పరిహారం అందించాలని కోరారు. వానాకాలంలో సకాలంలో వర్షాలు లేక పంటలు సగం దెబ్బతిన్నాయని, మిగిలిన పంటలు సైతం ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. ఎకరాకు సోయాబీన్ రెండు, మూడు క్వింటాళ్ల దిగుబడి



మాత్రమే వచ్చే పరిస్థితి ఉందని, పంట సాగుకు చేసిన ఖర్చులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదన్నారు. ఈ మేరకు తాహశీల్దార్ మహేందర్‌నాథ్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పుండ్లిక్, నాయకులు చంద్రకాంత్ యాదవ్, గోవింద్ పటేల్, పోశెట్టి, మౌలాఖాన్, బాబురావు, సాయినాథ్‌తో పాటు ఆయా గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధి అంతానికి కృషి చేయాలి

**-2030 నాటికి టీబీ రహిత భారత్ సాధనే లక్ష్యం**

**-జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్**

మెదక్ జిల్లాప్రతినిది (తెలంగాణ పత్రిక) 08 అక్టోబర్

క్షయ వ్యాధి నిర్మూలనకు అందరం సమిష్టిగా కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి అన్నారు. గురువారశీ సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో టి.బి. ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్ మాట్లాడుతూ ..2030 నాటికి దేశంలో టి.బి. (క్షయవ్యాధి)ని పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన టి.బి. ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా జోష్ టీమ్‌లను ఏర్పాటు చేసి, క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా వార్డు, మండల స్థాయిలో జాయింట్ స్క్వాడ్ ఫర్ హెల్త్ బృందాలను ఏర్పాటు చేసి, ప్రజలకు వ్యాధిపై అవగాహన కల్పించడంతో పాటు అనుమానితులకు వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, జిల్లాలో ఇప్పటికే 13 టి.బి. ముక్త్ గ్రామ పంచాయతీలను గుర్తించడం జరిగిందని తెలిపారు. టి.బి. వ్యాధి బ్యాక్టీరియా ద్వారా వ్యాప్తి చెందే అంటువ్యాధి అని, దగ్గు, తుమ్ముల ద్వారా ఇతరులకు సోకే అవకాశం ఉంటుందని తెలిపారు. సాయంత్రం వేళల్లో జ్వరం రావడం, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ముఖ్యంగా షుగర్, బి.పి. ఉన్నవారు, పొగతాగే అలవాటు ఉన్నవారు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, గ్రామాలలో నిర్వహించే వైద్య శిబిరాల వివరాలను ప్రజలకు ముందుగానే తెలియజేసి, అనుమానితులు పరీక్షలు చేయించుకునేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 215 యాక్టివ్ టి.బి. కేసులు ఉన్నాయని, టి బి. రోగులకు ప్రతి నెలా వైద్య సిబ్బంది వారి ఇళ్లకు వెళ్లి మందులు అందించడంతో పాటు అవసరమైన వైద్య సేవలను అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ద్వారా క్షయ వ్యాధి రోగులకు పోషకాహారం కోసం నిక్షయ్ పోషణ యోజన క్రింద నెలకు 1 వేయి రూపాయలు పోషణ భత్యం పూర్తి చికిత్స కాలం అందించడం జరుగుతుందని తెలిపారు. నిక్షయ్ మిత్ర కార్యక్రమం ద్వారా క్షయ



రోగులను దత్తత తీసుకుని వారికి అవసరమైన పోషకాహారాన్ని అందించాలని, క్రమం తప్పకుండా మందులు తీసుకోవడం ద్వారా వ్యాధిని పూర్తిగా నయం చేసుకోవచ్చని తెలిపారు. సాధారణంగా వైద్యుల సూచన మేరకు నిర్దేశిత కాలం పాటు మందులను క్రమం తప్పకుండా వినియోగించాలని సూచించారు. టి.బి. రోగులను దూరం పెట్టకుండా వారికి మానసిక ధైర్యం కల్పించాలని, వ్యాధి నియంత్రణకు పాటించవలసిన జాగ్రత్తలు, నియమాలపై అవగాహన కల్పించాలని సూచించారు. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, ఇతర సిబ్బంది ఒక్కొక్కరు ఒక టి.బి. రోగిని దత్తత తీసుకుని వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. దేశ వ్యాప్తంగా టి.బి. ముక్త్ భారత్ అభియాన్ ద్వారా జోష్ టీమ్‌లను ఏర్పాటు చేసి వ్యాధి నిర్మూలనకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామస్థాయిలో సర్పంచులు, పంచాయతీ అధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలు సమన్వయంతో పని చేసి టి.బి. నిర్మూలనకు కృషి చేయాలని, రోగులను దూరంగా ఉంచకుండా వారికి అవసరమైన సహకారం, మానసిక ధైర్యం అందించాలని సూచించారు. టి.బి. నిర్మూలనపై విస్తృత ప్రచారం నిర్వహించేందుకు మీడియా సహకారం తీసుకోవాలని తెలిపారు. టిబి నివారణ సంబంధించిన సమాచారం టోల్ ఫ్రీ నెంబర్ 1800-11-6666 ద్వారా అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం టి.బి. ముక్త్ భారత్ అభియాన్‌ను విజయవంతం చేసి, టి.బి. నిర్మూలనకు తమ వంతు కృషి చేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఎన్.సి.సి., మై భారత్ క్యాడెట్లు, వైద్య సిబ్బంది, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ పవిత్ర వాణి

**-అభ్యర్థిగా నామినేట్ చేయడానికి సీఎం చొరవ చూపాలి**

**-సిరిసిల్ల సభలో పద్మశాలిలకు ఎమ్మెల్సీ ప్రకటించడం పట్ల పద్మశాలి లు హర్షం**

పాలకుర్తి,అక్టోబర్08 (తెలంగాణ పత్రిక):

తెలంగాణ జాతిపిత సామాజిక న్యాయ ఉద్యమ సారథి ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ ఏకైక కూతురు డాక్టర్ పవిత్ర వాణిని గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేట్ చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ చూపాలని కోరుతున్నామని అన్నారు. పాలకుర్తీ మండల కేంద్రంలో గురువారం పాలకుర్తీ పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు చిలుకమారి వెంకటేశ్వర్లు అధ్యక్షతన సమావేశం జరిగింది, ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్టాపన కమిటీ అధ్యక్షులు డాక్టర్ మేడారపు సుధాకర్ పాల్గొన్నారు.ఈ



సందర్భంగా అధ్యక్షులు డాక్టర్ మేడారపు సుధాకర్, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘ సహాయ కార్యదర్శి పెనుగొండ రమేష్, పోపా జిల్లా సహాయ కార్యదర్శి చిదురాల ఎల్లయ్య లు మాట్లాడుతూ డాక్టర్ పవిత్ర వాణి ని ఎమ్మెల్సీగా గవర్నర్ కోటాలో నామినేట్ చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఇటీవల సిరిసిల్లలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పద్మశాలీలకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తామని ప్రకటించిన విషయాన్ని ప్రస్తావిస్తూ కొండ లక్ష్మణ్ బాపూజీ కుటుంబానికి ఎమ్మెల్సీగా ఇవ్వడం ద్వారా బిసి వర్గాలు, పద్మశాలి సామాజిక వర్గం స్వాగతిస్తుందని. పద్మశాలి సమాజ అభివృద్ధి కోసం చేనేత పరిశ్రమ పురోభివృద్ధి కోసం సహకార ఉద్యమ నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించిన కొండ లక్ష్మణ్ బాపూజీ నేడు బడుగు బలహీన వర్గాలకు ఒక ఆశాజ్యోతి గా నిలబడ్డారనీ అన్నారు. ఈ సమావేశంలో విగ్రహ కమిటీ గౌరవ సలహాదారులు మాజీ ఉప సర్పంచ్ కాటబత్తిని రమేష్, పట్టణ పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి చిదురాల మార్కండేయ, బాపూజీ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ గౌరవ అధ్యక్షులు పెనుగొండ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి చిలుకమారి సోమేశ్వర్ (బన్నీ), ఉపాధ్యక్షులు ఈగ శ్రీనివాస్,కార్యవర్గ సభ్యులు చిలకమారి శ్రీధర్,చిలుకమారి వెంకటేష్ లతో తదితరులు పాల్గొన్నారు

# చారకొండలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో బ్లాక్ డే




తెలంగాణ పత్రిక చారకొండ, అక్టోబర్ 8:

ఎన్నికల సంఘం జవాబుదారితనం కోరుతూ ఇండియా కూటమి ఎంపీలు ఢిల్లీలోని జంతర్ మంతర్‌కు శాంతియుతంగా వెళ్తున్న సమయంలో వారిని అడ్డుకుని బలప్రయోగం చేశారనే ఆరోపణలకు నిరసనగా భారత జాతీయ కాంగ్రెస్ పిలుపు మేరకు నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండల కేంద్రంలో బ్లాక్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నేతృత్వంలో ఇండియా కూటమి ఎంపీలు ఎన్నికల సంఘం జవాబుదారితనాన్ని కోరుతూ చేపట్టిన కార్యక్రమాన్ని అడ్డుకోవడం, వారిపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సంఘం విషయంలో పారదర్శకత,




జవాబుదారితనం పాటించాలని డిమాండ్ చేశారు.ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కు, రాజ్యాంగ పరిరక్షణ అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బ్లాక్ డే నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్ గౌడ్, సీనియర్ నాయకుడు సాంబయ్య గౌడ్, మాజీ డీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మహేందర్, సర్పంచులు మాధవరెడ్డి, చిలికేశ్వరం శంకర్, సహదేవ్, బొమ్మకంటి కృష్ణ, బోడి శివరాం, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గణేష్ గౌడ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోరేటి శివ, మండల కార్యదర్శి నారోజు నరసింహాచారి, రూప్‌సింగ్, వేముల రవి, వంగూరి జంగులు, నూనె శీను, పిల్లి శ్రీరాములు, కూకుడాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ దాడిపై కాంగ్రెస్ పార్టీ నాయకుల నిరసన

ముధోల్: 08అక్టోబర్(తెలంగాణ పత్రిక)



కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన తెలిపారు. మండల కేంద్రమైన ముధోల్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సాపేవార్ కిష్టయ్య ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో మంచివేసే చర్యలను తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రజల కోసం న్యాయంగా ప్రశ్నిస్తే దాడులు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం అన్యాయాన్ని ప్రశ్నిద్దామని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సురేందర్ రెడ్డి,మాజీ ఎంపీపీ అఫ్రోజ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్న యాదవ్,జిల్లా సెక్రెటరీ బషీర్, ఎస్సీ సెల్ జిల్లా సెక్రెటరీ విట్టల్ కాంబ్లె, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు విశ్వంబర్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్,నాయకులు మహేందర్, అశోక్, అనిల్, గంగా శేఖర్, వాజీద్, నర్సారెడ్డి పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం



పాలకుర్తి/తొర్రూరు(తెలంగాణ పత్రిక)ప్రతినిధి పున్నం సారయ్య :

మండలంలోని కంటాయపాలెం గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథులుగా లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ లయన్ నరహరి సుధాకర్‌రెడ్డి, లయన్ కృష్ణమూర్తి, లయన్ వెంకటేశ్వర్‌రెడ్డి, లయన్ రమణారెడ్డి హాజరయ్యారు. గ్రామస్థులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని కంటి పరీక్షలతో పాటు రక్తపోటు, మధుమేహ పరీక్షలు చేయించుకోవాలని వారు సూచించారు. శిబిరంలో మొత్తం 200 మందికి కంటి పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. వీరిలో 25 మందికి కంటిశుక్లం (క్యాటరాక్ట్) శస్త్రచికిత్స అవసరమని నేత్ర వైద్య సహాయకులు పులుగుజ్జ మహేష్ తెలిపారు. అవసరమైన వారికి తదుపరి వైద్య సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాగి సంగీత, జగదీశ్వరాచార్యులు, పూర్వ జిల్లా గవర్నర్ డాక్టర్ రాజేందర్‌రెడ్డి, తమ్మెర లక్ష్మీనరసింహారావు, వెంకట్‌రెడ్డి డీఎస్టీ, నాగవాణి ఆర్‌సీ, డాక్టర్ రామ్‌నరసయ్య జెర్సీ, రేవూరి వెంకన్న, ఏరియా లీడర్ తమ్మెర విశ్వేశ్వరరావు, దామెర సురేష్, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు, వైద్య సిబ్బంది శిబిరంలో సేవలందించారు.

## బిచ్కుంద మున్సిపాలిటీలో నూతన బార్ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

**-జిల్లా అప్కారి అధికారి ముకుంద రెడ్డి**

కామారెడ్డి, అక్టోబర్ 8, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి జిల్లాబిచ్కుంద ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మున్సిపాలిటీలో నూతనంగా బార్ ఏర్పాటు చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఆబ్కారీ అధికారి బి. ముకుంద రెడ్డి తెలిపారు. నూతన బార్ ఏర్పాటుకు సంబంధించి జిల్లా ఆబ్కారీ కార్యాలయంలో ఇప్పటివరకు 13 దరఖాస్తులు అందినట్లు ఆయన తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులు ఫారం-1 ద్వారా రూ.1 లక్షను డిమాండ్ డ్రాఫ్ట్ లేదా చలాన్ రూపంలో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తుతో పాటు మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్ కార్డు, పాన్ కార్డు జిరాక్స్ ప్రతులను జత చేయాలని సూచించారు. దరఖాస్తులను అక్టోబర్ 12వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు జిల్లా ఆబ్కారీ కార్యాలయంలోని కార్యాలయ పనివేళల్లో సమర్పించవచ్చని తెలిపారు. ఎంపికైన బార్‌కు సంబంధించి సంవత్సరానికి రూ.30 లక్షల ఎక్సైజ్ పన్నును ప్రభుత్వానికి నిబంధనల ప్రకారం విడతల వారీగా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. బార్ కేటాయింపు ప్రక్రియను అక్టోబర్ 16వ తేదీన ఉదయం 11.00 గంటలకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా పద్ధతిలో పారదర్శకంగా నిర్వహించనున్నట్లు జిల్లా ఆబ్కారీ అధికారి తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని ఆయన కోరారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే రేవూరి

**-మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి**



ఆత్మకూర్, అక్టోబర్ 08 (తెలంగాణ పత్రిక):

ఆత్మకూర్ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, మాజీ వార్డు సభ్యులు పొదిల సదయ్య సతీమణి బుధవారం మృతి చెందగా, న్యాయవాది తనుగుల సన్నీ కుమార్ తండ్రి,తనుగుల సాంబయ్య గురువారం ఆకస్మికంగా మృతి చెందారు. కాగా విషయం తెలుసుకున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి గురువారం వారి నివాసాలకు వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు. సాంబయ్య భౌతిక దేహానికి , సదయ్య సతీమణి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కమలాపురం రమేష్, నాయకులు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రేవూరి జలంధర్ రెడ్డి, ఆత్మకూర్ సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరి రాజు, పరికరాల వాసు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రహరీ గోడకు శంకుస్థాపన

-పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- పరకాల ఎమ్మెల్యే తీవ్ర ప్రకాశ్ రెడ్డి



ఆత్మకూర్, అక్టోబర్ 08 (తెలంగాణ పత్రిక):

ఆత్మకూర్ మండలం పెద్దాపురం హైస్కూల్ ఆవరణలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రహరీ గోడ నిర్మాణ పనులకు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ వ్యవస్థను ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిందన్నారు. విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ద్వారా గ్రామీణ ప్రాంతాల పేద విద్యార్థులకు కూడా మెరుగైన విద్యా అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని అన్నారు. పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేసి విద్యార్థులకు అనుకూలమైన వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కమలాపురం రమేష్, మండల అధ్యక్షులు రేవూరి జలంధర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పరికరాల వాసు, కక్కెర్ల రాజు, చిదురాల శ్రీనివాసరెడ్డి ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మొబైల్ పోతే సీఇఐఆర్ పోర్టల్ లో ఫిర్యాదు చేయాలి: డిసిపి

పాలకుర్తి అక్టోబర్08 (తెలంగాణ పత్రిక):



డిసిపి జనగామ, పాలకుర్తి సీఐ ఆధ్వర్యంలో పోగొట్టుకున్న 67 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేసిన పోలీసులు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ, మొబైల్ ఫోన్ పోయిన వెంటనే ధైర్యాన్ని కోల్పో కుండా పోర్టల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా ఫోన్ పోగొట్టుకున్నా లేదా గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనంగా తీసుకెళ్లినా, వెంటనే కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన Central Equipment Identity Register పోర్టల్లో పూర్తి వివరాలను నమోదు చేసి, పోగొట్టుకున్న ఫోన్ను బ్లాక్ చేయవచ్చని తెలిపారు. పోగొట్టుకున్న వ్యక్తులకు కంప్యూటర్ పరిజ్ఞానం లేనిపక్షంలో, ప్రతి పోలీస్ స్టేషన్లో ఒక పోలీసు అధికారిని పోర్టల్ బాధ్యతాధికారిగా నియమించడం జరిగిందని తెలిపారు. సంబంధిత పోలీస్ స్టేషన్ ను సంప్రదించి నప్పుడు, బాధ్యతాధికారి పోర్టల్లో వివరాలను నమోదు చేస్తారని, తద్వారా కోల్పోయిన మొబైల్ ఫోన్ను తిరిగి పొందే అవకాశం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ పోర్టల్ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ఎవరైనా సెకండ్ హ్యాండ్ ఫోన్లు అమ్మకానికి పెట్టినప్పుడు వాటిని కొనుగోలు చేయవద్దని సూచించారు. పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల రికవరీలో కృషి చేసిన ప్రతి పోలీస్ స్టేషన్ సిబ్బందిని డిసిపి అభినందించారు.

# పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రా

-3 ఎకరాల 14 గుంటల స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు.

ఆదిభట్ల సర్కిల్ అక్టోబర్ 08 ( తెలంగాణ పత్రిక):-




ఆదిభట్ల సర్కిల్, తుర్కయంజాల్ డివిజన్ పరిధిలోని మన్నెగూడ టౌన్షిప్ లో సుమారు 3 ఎకరాల 14 గుంటల పార్కుస్థలాన్ని కాపాడాలని వెల్ఫేర్ అసో సియేషన్ సభ్యులు హైడ్రా కి ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన సీఐ సైదులు పార్కు స్థలాన్ని పరిశీలించి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. పార్కు స్థలం అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవడంతో టౌన్షిప్ అసోసియేషన్ సభ్యులు హైడ్రాకి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చెన్నారెడ్డి, ఉపాధ్యక్షులు మల్లారెడ్డి, జాయింట్ సెక్రటరీ రాజశేఖర్ రెడ్డి, సెక్రటరీ రామ్ రెడ్డి, చీఫ్ అడ్వైజర్ సురేందర్ రెడ్డి, రఘురామయ్య కాలనీవాసులు ఉన్నారు.

# 2030 నాటికి దేశాన్ని టీబీ రహితంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం

# అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

-భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు..

జయ శంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి: (తెలంగాణ పత్రిక) అక్టోబర్ 8



శంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి జయ శంకర్ భూపాలాపల్లి గురువారం ఐడీఓసీలో జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన టీబీ రహిత గ్రామ పంచాయతీల సన్మానం, జోష్ బృందాల ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ముప్పు ఉన్న గ్రామాలను గుర్తించి మొబైల్ ఎక్స్‌రే వాహనాల ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. టీబీ నిర్ధారణ అయిన వారికి నాలుగు నెలల పాటు ఉచిత వైద్యం, మందులు అందిస్తుండగా.. బాధితులతో సన్నిహితంగా ఉండే వారికి వ్యాధి సోకకుండా మూడు నెలల పాటు ముందస్తు రక్షణ మందులు ఉచితంగా ఇస్తున్నట్లు స్పష్టంచేశారు. చికిత్స పూర్తయ్యే వరకు బాధితులకు నెలకు రూ. 1,000 చొప్పున పోషణ భత్యం అందిస్తున్నట్లు వెల్లడించారు. గ్రామాల్లో టీబీ కేసులను గుర్తించడం, ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం మై భారత్ వాలంటీర్లతో జాయింట్ స్క్వాడ్, జోష్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టీబీ లక్షణాలు ఉన్నవారు సమీప ప్రభుత్వ వైద్య కేంద్రాల్లో ఉచిత పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. తొలిదశలో గుర్తించి పూర్తి చికిత్స తీసుకుంటే టీబీని నయం చేసుకోవచ్చన్నారు. అనంతరం టీబీ రహిత గ్రామాలుగా ఎంపికైన 12 గ్రామ పంచాయతీల సర్పంచులను శాలువా, ప్రశంసాపత్రాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, జిల్లా వైద్యాధికారి డా. మధుసూదన్, వైద్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రష్యా సైన్యం నుంచి తెలంగాణ బాధితుల విడుదల మాతృభూమికి చేరిన 10 మంది..

# మిగిలిన వారి రక్షణకు కేంద్రం ముమ్మరయత్నాలు..!

తెలంగాణ పత్రిక ప్రతినిధి హైదరాబాద్:



ఏజెంట్ల మోసపూరిత మాటలు నమ్మి రష్యా సైన్యంలో చిక్కుకుపోయిన తెలంగాణ బాధితులను స్వదేశానికి రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ముమ్మర చర్యలు చేపట్టింది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ చేపట్టిన దౌత్యపరమైన చొరవతో ఇప్పటివరకు 10 మంది సురక్షితంగా భారత్‌కు చేరుకున్నారు. మాస్కో లోని భారత రాయబార కార్యాలయంతో పాటు రష్యన్ డిఫెన్స్ అధికారులతో జరిపిన సంప్రదింపులు సత్ఫలితాలనిచ్చాయి. ఈ వ్యవహారంలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, రాష్ట్ర ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ వైస్ ఛైర్మన్ మందా భీంరెడ్డి శ్రమించి కేంద్ర అధికారులతో చర్చలు జరిపారు. స్వదేశానికి తిరిగొచ్చిన వారిలో నిజామాబాద్ జిల్లా ధర్పల్లికి చెందిన కస్తూరి తిరుపతి, జగిత్యాల జిల్లా బండలింగాపూర్‌కు చెందిన గడ్డం శేఖర్, కేశాపూర్ వాసి కొడ రాజశేఖర్ ముందుగా ఢిల్లీకి చేరుకున్నారు. అలాగే వరకంటి కార్తీక్, గొల్ల బాలయ్య, రెబ్బ భరత్, సురేష్, గోరువంతుల లింబాద్రి, విజయవాడకు చెందిన కరి నాగార్జున, అనకాపల్లికి చెందిన పోడి గోవిందలు బుధవారం సాయంత్రం ఢిల్లీకి చేరుకున్నారు. మరో నలుగురు బాధితుల వివరాలను సేకరించిన అధికారులు వారిని కూడా త్వరలోనే విడుదల చేయించేందుకు చర్యలు వేగవంతం చేశారు. అయితే, ధర్పల్లికి చెందిన మెగావత్ ప్రకాష్, జక్రాన్‌పల్లికి చెందిన భూక్యా రవీందర్, బాన్సువాడకు చెందిన మహమ్మద్ అఫ్జల్‌ఖాన్, సిరికొండకు చెందిన సిర్న అశోక్‌లు ఇంకా రష్యా ఆర్మీ ఆధీనంలోనే ఉన్నారు. వీరికి రష్యా పౌరసత్వం కల్పించడం వల్ల విడుదల ప్రక్రియ సంక్లిష్టంగా మారినట్లు రష్యన్ ఆర్మీ అధికారులు పేర్కొంటున్నారు. అయినప్పటికీ వీరి విడుదలకు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ ఉన్నతాధికారులు రష్యా ప్రతినిధులతో చర్చలు కొనసాగిస్తున్నారు. కాగా, ఎల్లారెడ్డిపేటకు చెందిన దొమ్మటి కిషన్, వరంగల్‌కు చెందిన పోతరాజు విజయకృష్ణ, కోరుట్లకు చెందిన ముక్కెర రాజ్‌కుమార్, మద్నూర్‌కు చెందిన సుప్పన్ స్వామి కూడా రష్యా ఆర్మీలో చిక్కుకున్నారని వారి కుటుంబ సభ్యులు హైదరాబాద్ ప్రవాసీ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అయితే చందుర్తికి చెందిన చక్కర్ల చిన్నవెం కటి, శాంతపురి రాజులు మాత్రం తమ ఆర్థిక అవసరాల దృష్ట్యా రష్యా ఆర్మీలోనే కొనసాగుతామని స్పష్టం చేశారు.

# ప్రెస్ కౌన్సిల్‌లో ఐజేయూకు మూడు సభ్యత్వాలు

-జాతీయ స్థాయిలో ఐజేయూకు దక్కిన గౌరవం: అల్లం నారాయణ, ఆస్కాని మారుతి సాగర్

హైదరాబాద్/ వికారాబాద్ (అక్టోబర్ 08) తెలంగాణ పత్రిక ప్రతినిధి:




ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (PCI)లో ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (IJU)కు చెందిన ముగ్గురికి సభ్యత్వాలు లభించడం పట్ల తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (TUWJ--H-143) హర్షం వ్యక్తం చేసింది. ఐజేయూ అధ్యక్షుడు గీతార్థ్ పాఠక్ (అస్సాం), ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్ కోహ్లీ (చండీగఢ్), ఐజేయూ సభ్యుడు బిజాయ్ కే (మణిపూర్)లను ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులుగా నామినేట్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. తెలంగాణలో TUWJ--H-143తో పాటు దేశవ్యాప్తంగా 21 రాష్ట్రాల జర్నలిస్టు సంఘాలతో కలిసి ఐజేయూ జర్నలిస్టుల హక్కులు, మీడియా స్వేచ్ఛ పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తోందని టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి, ఐజేయూ కోశాధికారి ఆస్కాని మారుతి సాగర్ తెలిపారు. ఐజేయూ నుంచి ముగ్గురికి ప్రెస్ కౌన్సిల్ సభ్యత్వాలు దక్కడం యూనియన్‌కు లభించిన గౌరవంగా వారు అభివర్ణించారు. కొత్తగా నామినేట్ అయిన సభ్యులు జర్నలిస్టుల హక్కులు, ప్రయోజనాల పరిరక్షణతో పాటు మీడియా స్వేచ్ఛను కాపాడే దిశగా చొరవ చూపాలని వారు ఆకాంక్షించారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో సభ్యులుగా నామినేట్ అయిన ముగ్గురితో పాటు ఇతర సభ్యులందరికీ తెలంగాణ జర్నలిస్టుల తరఫున వారు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# కార్పొరేట్ పరిధిలోని 132kv సబ్ స్టేషన్ నందు ప్రత్యేక ఈ-వ్యర్థాల పై ప్రచారం

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక అక్టోబర్ 8




కేంద్ర ప్రభుత్వ బొగ్గు మంత్రిత్వ శాఖ వారి ఆదేశానుసారం సంస్థ చైర్మన్ & మేనేజింగ్ డైరక్టర్ డా. బుద్ధ ప్రకాష్ జ్యోతి, సూచనల మేరకు సింగరేణి సంస్థ వ్యాప్తముగా అక్టోబర్-2 వ తేదీ నుండి 31 వ తేది వరకు నిర్వహించే స్పెషల్ క్యాంపెయిన్- 6 లో భాగముగా గురువారము నాడు కార్పొరేట్ పరిధిలోని 132ిజ సబ్ స్టేషన్ నందు జనరల్ మేనేజర్(ఈ&ఎం) సెంట్రల్ వర్క్ షాప్ కే.రామ్మోహన్ ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వాహణ పరిసరాల పరిశుభ్రత పై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించి కార్యక్రమానికి హాజరైన ఉద్యోగుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సంధర్భముగా జనరల్ మేనేజర్(ఈ&ఎం) సెంట్రల్ వర్క్ షాప్ కే.రామ్మోహన్ మాట్లాడుతూ ఈ- వ్యర్థాలను సాధారణ వ్యర్థాలతో కలపకుండా శాస్త్రీయ పద్దతిలో డిస్పోస్ చేయటం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో తోడ్పడుతారని, అదే విధముగా మన చుట్టూ ఉన్న పరిసరాల్ని ఎప్పుడూ పరిశుభ్రముగా ఉండేలా చూడటమే ఈ స్పెషల్ క్యాంపెయిన్-6 యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. ఈ కార్యక్రమం లో జనరల్ మేనేజర్(ఈ&ఎం) సెంట్రల్ వర్క్ షాప్ కే.రామ్మోహన్ తో పాటు డిజిఎం(ఈ&ఎం) కే.వేలాద్రి, జేఈ(ఈ&ఎం) కోట శ్రీనివాస రావు మరియు ఫోర్ మెన్ , ఎలక్ట్రీషియన్ , కార్మికులు పాల్గొన్నారు.

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143

# రేపు జరిగే ఆర్టీసీ గుర్తింపు ఎన్నికల్లో జుఖ కూటమిని గెలిపించండి





**-RTC సంస్థను కాపాడండి**

**-ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు, (ఈ యు) మహబూబాద్ డిపో గౌరవ అధ్యక్షులు బి అజయ్ సారధి పిలుపు**

పాలకుర్తి తొర్రూర్ తెలంగాణ పత్రిక ప్రతినిధి పున్నం సారయ్య

రేపు అక్టోబర్ 9న జరిగే ఆర్టీసీ గుర్తింపు ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ కూటమిని గెలిపించాలని ఆర్టీసీ సంస్థలు కాపాడాలని కార్మికులకు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు బి అజయ్ సారధి రెడ్డి పిలుపునిచ్చారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర గుర్తింపుకు బస్సు గుర్తుకు రీజియన్ గుర్తింపుకు కాగడా గుర్తుకు ఆర్టీసీ కార్మికులు అధిక సంఖ్యలో తమ ఓట్లు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు ఈ సందర్భంగా ఒక ప్రకటనలో తెలియజేస్తూ ముఖ్యంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో దశలవారీగా పోరాటాలు చేశామని ఎన్నో కేసులు కూడా పెట్టబడ్డాయని అన్నారు ఈ సందర్భంగా గుర్తింపు ఎన్నికల్లో బస్సు గుర్తు మరియు కాగడా గుర్తులను గెలిపించాలని కోరారు పెండింగ్లో ఉన్న డిఏలు పిఆర్సి బకాయిలు విడుదల కోసం ఎంప్లాయిస్ యూనియన్ కూటమినే గెలిపించాలని కోరారు ఎంప్లాయిస్ యూనియన్ కూటమి గెలుపు ద్వారానే కార్మికులకు ఉద్యోగ భద్రత ఉంటుందన్నారు విలీన ప్రక్రియను అడ్డుకునేందుకు అధికార పార్టీ కొన్ని సంఘాలకు మద్దతు తెలుపుతుందన్నారు ఆర్టీసీ కార్మికులకు మెరుగైన వైద్య సేవలు కార్పొరేట్ స్థాయి వైద్యం అందేందుకు ఎంప్లాయిస్ యూనియన్ ని గెలిపించాలని కోరారు మహిళా కండక్టర్లకు డ్రైవర్లకు ప్రత్యేక గదులు డిపోల వద్ద ఏర్పాటు చేయడమే ఈయూ కూటమి దయమన్నారు నేడు ఆర్టీసీ ఎన్నికలు జరుగుతున్నాయి అంటే అది ఎంప్లాయిస్ యూనియన్ పోరాటమే అన్నారు అశ్వద్ధామ రెడ్డి తన సొంత రాజకీయ ప్రయోజనాల కోసమే జేఏసీని రెండుగా చీల్చి కార్మికులను విడగొట్టాడని తెలిపారు కార్మికులను ఏకం చేయడానికి ఎన్ఎంయు సహకరించిందని తెలిపారు ఈ సందర్భంగా ఆర్టీసీ సంస్థలు కాపాడడానికి ప్రభుత్వంలో విలీనం చేయడానికి ఎంప్లాయిస్ యూనియన్ కు ఓటు వేయడం ద్వారా ఇవన్నీ సాధ్యమవుతాయని విజ్ఞత గల ఆర్టీసీ కార్మికుల ఓటర్లు ఆలోచించి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర గుర్తింపుకు బస్సు గుర్తుపై రీజియన్ గుర్తింపుకు కాగడా గుర్తుపై తమ యొక్క అమూల్యమైన ఓట్లు వేసి గెలిపించవలసిందిగా బి అజయ్ సారధి రెడ్డి కోరారు ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు తమ్మెర విశ్వేశ్వరరావు, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్ కుమార్, సిపిఐ తొర్రూర్ మండల కార్యదర్శి బందు మహేందర్, ఏఐటియుసి మండల అధ్యక్ష కార్యదర్శులు గణపురం లక్ష్మణ్, పేరబోయిన కిరణ్ కుమార్ పట్టణ కార్యదర్శి ముద్రబోయిన వెంకన్న, ఏఐవైఎఫ్ నాయకులు పేరబోయిన క్రాంతికుమార్. తదితరులు పాల్గొన్నారు.

# క్షేత్ర స్థాయిలో వివరాలు కచ్చితత్వంతో నమోదు చేయాలి





**-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**-భూముల రీ సర్వేపై రెవెన్యూ, సర్వే శాఖ అధికారులకు శిక్షణ**

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ – 08, తెలంగాణ పత్రిక.

జిల్లాలో భూముల రీ సర్వేలో భాగంగా క్షేత్రస్థాయిలో సర్వే చేసి వివరాలు కచ్చితత్వంతో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.భూభారతి కింద భూముల రీసర్వే ప్రక్రియపై జిల్లాలోని డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలు, జీపీఓలు, సర్వేయర్లు, లైసెన్స్ సర్వేయర్లకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు.ముందుగా భూ భారతి కింద భూముల రీ సర్వే ఉద్దేశం, ఉపయోగాలు, పాటించాల్సిన నిబంధనలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. భూముల రీ సర్వే కోసం జిల్లాలో మొత్తం 18 రోవర్ యంత్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సర్వే కోసం ప్రభుత్వం లైసెన్స్ సర్వేయర్లను నియమించిందని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వారు విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.భూముల రీ సర్వే రెవెన్యూ అధికారులు, లైసెన్స్ సర్వేయర్ల టీంలతో చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని స్పష్టం చేశారు. రీ సర్వేలో భాగంగా ముందుగా గ్రామంలో గ్రామసభ నిర్వహించాలని, రీ సర్వే ఉద్దేశం, ప్రయోజనాలు, మొత్తం ప్రక్రియ తదితర అంశాలపై గ్రామస్తులకు వివరించాలని సూచించారు. ఏ ఏ భూముల్లో సర్వే చేస్తారో వాటి వివరాలను ముందుగానే చేరవేయాలని తెలిపారు. జీపీఓ, పంచాయతీ కార్యదర్శి సైతం సర్వేలో ఉండాలని వెల్లడించారు. ముందుగా గ్రామ సరిహద్దు సర్వే చేయాలని, రెవెన్యూ, నీటి పారుదల శాఖ, అటవీ శాఖ తదితర శాఖల అధికారులకు సమాచారం అందజేసి.. వారు సైతం సర్వేలో పాల్గొనేలా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాలని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో భూముల వివరాలను కచ్చితత్వంతో నమోదు చేయాలని సూచించారు. ఈ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, కలెక్టరేట్ పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కళాశాల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి జీవన్‌రెడ్డి డిమాండ్

జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) అక్టోబర్ 8



జగిత్యాల మెడికల్ కళాశాలలో భవన నిర్మాణాలు, వసతి సౌకర్యాల కల్పనలో జరుగుతున్న జాప్యాన్ని వెంటనే పరిష్కరించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జగిత్యాల పట్టణంలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కేసీఆర్ హయాంలో జిల్లాకో మెడికల్ కళాశాల ఏర్పాటు చేసి వైద్య విద్యకు ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. జగిత్యాల మెడికల్ కళాశాలకు ఐదేళ్లు గడిచినా భవనాలు, వసతి, ల్యాబ్ తదితర సౌకర్యాలు పూర్తికాకపోవడం బాధాకరమన్నారు. మిగతా మంజూరైన మెడికల్ కళాశాలల భవనాలు పూర్తయ్యాయని, జగిత్యాల కళాశాల విషయంలోనే జాప్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించారు.24 గంటలుగా విద్యార్థులు నిరసన వ్యక్తం చేస్తున్నప్పటికీ ఎమ్మెల్యే, అధికారులు స్పందించకపోవడం సరికాదన్నారు. కలెక్టర్ వెంటనే విద్యార్థులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని కోరారు. డిసెంబర్‌లోగా నిర్మాణ పనులు పూర్తి చేసి 2027 నూతన సంవత్సరానికి విద్యార్థులకు సౌకర్యాలు అందించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష నిరసన కార్యక్రమాలు చేపడతామని జీవన్‌రెడ్డి హెచ్చరించారు. సమావేశంలో దావ వసంత సురేష్,హరిచరణ్‌రావు,వెంకటేశ్వర్ రావు, వొళ్లెం మల్లేశం, మహిపాల్ రెడ్డి, దేవేందర్ నాయక్, రాగుల ప్రదీప్, నక్క జీవన్,బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారానికి వాట్సాప్ గ్రీవెన్స్ సెల్ ప్రారంభం

**-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

నిర్మల్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 08 (తెలంగాణ పత్రిక)



నిర్మల్ జిల్లా ప్రజల సమస్యలను సులభంగా, వేగంగా పరిష్కరించేందుకు ప్రత్యేక వాట్సాప్ గ్రీవెన్స్ సెల్ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులు, వినతుల కోసం ప్రతిసారీ కలెక్టరేట్‌కు రావాల్సిన అవసరం లేకుండా, ఇంటి వద్ద నుంచే తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా ఈ డిజిటల్ వేదికను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ప్రజలు తమ ఫిర్యాదులను వాట్సాప్ నంబర్ 8317557897కు మెసేజ్ రూపంలో పంపవచ్చని తెలిపారు. ఫిర్యాదుతో పాటు సమస్యకు సంబంధించిన పూర్తి వివరాలు, సమస్య ఉన్న ప్రదేశం, చిరునామా, అవసరమైన ఆధారాలు, ఫొటోలు పంపించాలని సూచించారు. ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును ప్రత్యేక బృందం నమోదు చేసి, వెంటనే సంబంధిత శాఖాధికారులకు పంపిస్తుందని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నిర్ణీత కాలపరిమితిలో సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా ప్రజలు ఈ వాట్సాప్ గ్రీవెన్స్ సెల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజా సమస్యలు, ప్రభుత్వ సేవలకు సంబంధించిన ఫిర్యాదులను మాత్రమే ఈ నంబర్‌కు పంపించాలని, అనవసరమైన లేదా తప్పుడు సందేశాలను పంపవద్దని సూచించారు. 8317557897 నంబర్‌ను కేవలం వాట్సాప్ సేవల కోసం మాత్రమే వినియోగించాలని, ఈ నంబర్‌కు ఫోన్ కాల్స్ చేయరాదని జిల్లా కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## సేవ్ డెమోక్రసీ నినాదంతో చలో లోక్‌భవన్‌లో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి




తెలంగాణ పత్రిక వలిగొండ మండలం అక్టోబర్ 8.

యాదాద్రి భువనగిరి జిల్లా సేవ్ డెమోక్రసీ నినాదంతో ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన చలో లోక్‌భవన్ నిరసన కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన ర్యాలీ నిర్వహించారు. నెక్లెస్ రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి లోక్‌భవన్ వరకు ర్యాలీ కొనసాగింది. ూజజజ అధ్యక్షులు, మీాజ మహేష్ కుమార్ గౌడ్, ూ×జజ సెక్రటరీ సచిన్ సావంత్, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, సహచర ఎమ్మెల్యేలతో కలిసి కుంభం అనిల్ కుమార్ రెడ్డి ర్యాలీలో పాల్గొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఇండియా కూటమి చేపట్టిన నిరసనలో ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి భాగస్వామ్యం అయ్యారు. ఈ కార్యక్రమంలో వలిగొండ మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తిని సహదేవ్ గౌడ్ పట్టణ అధ్యక్షులు జానకి రాములు యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా ఉపాధ్యక్షురాలు కే సి రెడ్డి నీరజ వెంకటేశ్వర్ రెడ్డి మరియు మహిళలు కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చికిత్స పొందుతు గృహిణి మృతి

పాపన్నపేట, అక్టోబర్ 08:(తెలంగాణ పత్రిక)



రోడ్డు ప్రమాదం లో తీవ్ర గాయలు అయి ఆసుపత్రి లో చికిత్స పొందుతు ఓ మహిళా మృతి చెందిన సంఘటన నాగ్సాన్ పల్లి లో గురువారం చోటుచేసుకుంది. పాపన్నపేట పోలీసులు, కూటింబికుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నాగ్సాన్ పల్లి గ్రామానికి చెందిన చెల్మెట్టి ఎల్లమ్మ వ్యవసాయ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం మెదక్ పట్టణానికి వెళ్లి తిరిగి స్వగ్రామమైన నాగ్సాన్ పల్లి కి వచ్చేందుకు ఏడుపాయల కమాన్ వద్ద రాత్రి సమయం లో వేచి ఉన్న సమయం లో ఏడుపాయల నుండి కమాన్ వైపు వస్తున్న ద్విచక్ర వాహనదారుడు డి కొనడంతో తలకు తీవ్ర గాయాలు కావడం తో స్థానికులు వెంటనే క్షతగాత్రు రాలైన ఎల్లమ్మ ను మెదక్ ప్రయివేట్ ఆసుపత్రి కి తరలించగా పరీక్షించిన డాక్టర్లు పరిస్థితి విషమించడం తో భాగ్యనగరం లోని ప్రయివేటు ఆసుపత్రి కి తరలించగా గత మూడు రోజులు గా చికిత్స పొందుతు గురువారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. కాగా మృతురాలు కుటింబికులు పాపన్నపేట పోలీసులకు పిర్యాదు చేయడం తో పాపన్నపేట ఎస్ ఐ శ్రీనివాస్ గౌడ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కేఎల్ గ్రూప్ అధినేత కొండ లక్ష్మణ్

జగిత్యాల, అక్టోబర్ 8 (తెలంగాణ పత్రిక):



జగిత్యాల రూరల్ మండలం అనంతరం (రోడ్యాం) గ్రామానికి చెం దిన జంగా చిన్న గంగన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో కే.ఎల్ గ్రూప్ అధినేత కొండ లక్ష్మణ్ గంగన్న కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలియజేశారు. తమ కుటుంబాన్ని ఆదుకునేందుకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని కుటుంబ సభ్యులను ఓదార్చారు .

## ఎన్నికల సంఘం పనితీరుపై కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

మాడుగులపల్లి//నల్గొండ//అక్టోబర్ 8:(తెలంగాణ పత్రిక):-



టరు జాబితా సవరణ ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ మాడుగులపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా గడ్డం వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఏకపక్ష, పక్షపాత విధానాలను విడనాడాలని డిమాండ్ చేశారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను తక్షణమే నిలిపివేయడంతో పాటు, ఈ ప్రక్రియలో అక్రమంగా తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని కోరారు. ఓటరు జాబితాకు సంబంధించిన అంశాలపై పెండింగ్‌లో ఉన్న కేసులను సుప్రీం కోర్టు సత్వరమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సంఘం పనితీరుపై కాంగ్రెస్ పార్టీ అభ్యంతరం వ్యక్తం చేస్తోందని, పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రజా సమస్యలపై గళం విప్పుతున్న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు కాంగ్రెస్ ఎంపీలను అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. వారిపై నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన పోరాడుతుందని, ఓటు హక్కును కాపాడేందుకు చేపట్టే ప్రతి పోరాటంలో కాంగ్రెస్ శ్రేణులు ముందుంటాయని గడ్డం వేణుగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా నిజం



# ఏదుల్లగూడెం శివారులో యువకుడు మృతి



తెలంగాణ పత్రిక వలిగొండ మండలం అక్టోబర్ 8.

యాదాద్రి భువనగిరి జిల్లా. వలిగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏదుల్లగూడెం గ్రామ శివారులో ఓ 25 ఏళ్ల యువకుడు మృతి చెందిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. ఏదుల్లగూడెం గ్రామానికి చెందిన జంగిటి కర్ణాకర్ వ్యవసాయ భూమిలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్న కర్ణాకర్‌కు మద్యం సేవించే అలవాటు ఉందని, కుటుంబ సభ్యులు పలుమార్లు మందలించినట్లు తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు వలిగొండ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మరణానికి సంబంధించిన పూర్తి కారణాలను దర్యాప్తులో నిర్ధారించాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

# దేశంలో లక్షలాది ఓట్లు తొలగించడం బాధాకరం

## మాజీ సర్పంచ్ మేడి అంజయ్య కాంగ్రెస్ నాయకుడు

కరీంనగర్ జిల్లా అక్టోబర్ 8 (తెలంగాణ పత్రిక ప్రతినిధి)

ఈ దేశంలో లక్షలాది ప్రజల ఓట్లు తొలగించడం చాలా బాధాకరం దేశ రాజధానిలో ఓటు చోరీ పోరాటం మూడవరోజు బిజెపి ఓటు చోరీపై పోరాటం చేస్తున్న మన నాయకులు రాహుల్ గాంధీ శ్రీమతి ప్రియాంక గాంధీ ఇండియా కూటమి ఎంపీలపై జరిగిన పోలీసుల దౌర్జన్యం లాటి చార్జిని నిరసిస్తూ ఏఐసిసి టిపిసిసి పిలుపుమేరకు దేశ రాజధాని లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు తెలంగాణ ఎంపీలు రాహుల్ కు మద్దతుగా న్యాయపోరాటం రాష్ట్ర రాజధానిలో మంత్రులు ఎమ్మెల్యే ఎమ్మెల్సీలు కాంగ్రెస్ నాయకులు ఇండియా కూటమికి మద్దతుగా ర్యాలీ రాష్ట్రవ్యాప్తంగా దళిత బడుగు బలహీన వర్గాలు ఎస్టీ మరియు మైనార్టీ ఓటు చోరీ చేయడం చాలా దౌర్జన్యం దేశ ఎన్నికల కమిషనర్ ఈ దేశంలో నలుగురు ఓటు చోరీ ద్రోహులు ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ దేశ ప్రధాని నరేంద్ర మోడీ కేంద్ర హోం మంత్రి అమిత్ షా మరియు ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ మీరు వెంటనే రాజీనామా చేయాలి అని డిమాండ్ చేయడం జరిగింది భారతదేశంలో బాబాసాహెబ్ రాసిన రాజ్యాంగాన్ని గౌరవించే నాయకుడు రాహుల్ గాంధీ ఈ దేశంలో ఉన్న బడుగు బలహీన వర్గాలు రాజకీయ పార్టీలకు అతీతంగా అంబేద్కర్ సంఘాలు కుల సంఘాలు ప్రజా సంఘాలు ప్రజలు ఓటు చోరీ ఉద్యమంలో భాగస్వాములు కావాలి బాబాసాహెబ్ అంబేద్కర్ ఇచ్చిన ఓటు హక్కును కాపాడుకునే బాధ్యత మనందరి పైన ఉంది గ్రామస్థాయిలో మండల స్థాయిలో జిల్లా స్థాయిలో మనమందరం ఉద్యమించే బాధ్యత మన అందరి పైన ఉన్నది అని కొనియాడారు దేశం గర్వించదగ్గ నాయకులు రాహుల్ గాంధీ మరియు ప్రియాంక గాంధీ గారు ఈ రోజుల్లో ఒక సర్పంచ్ కొడుకు లేదా ఏదైనా చిన్న పదవిలో ఉన్న నాయకుడి కుటుంబ సభ్యులు కూడా అధికారం వచ్చిందనే గర్వంతో పెద్ద నాయకుల వారసుల ఫీలై అవుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి కానీ ఒక్కసారి చరిత్రను చూడండి ఈ దేశ మొదటి ప్రధానమంత్రి గారు అయినా వారి తాతగారు నెహూరు వారి నానమ్మ మాజీ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ వారి తండ్రి మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ దేశాన్ని పాలించిన కుటుంబంలో పుట్టినప్పటికీ రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ పదవులను కాదు ప్రజలను నమ్ముకున్నారు అహంకారాన్ని కాదు ప్రజాసేవనించుకున్నారు అధికారాన్ని కాదు దేశ ప్రజల గొంతుక నిలబడాన్ని ఎంచుకున్నారు అని వారు తెలియజేసినారుద.

# దమ్మన్నపేట ముచ్చర్ల విద్యార్థులకు షూ బెల్ట్‌లు పంపిణీ



గంభీరావుపేట తెలంగాణ పత్రిక అక్టోబర్ 8

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లోని ముచ్చర్ల దమ్మన్నపేట ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆయా గ్రామ సర్పంచ్ లు దుంపల చంద్ర శేఖర్ రెడ్డి నక్క ప్రశాంత్ చేతుల మీదుగా షూ బెల్ట్ అందజేశారు ఈసందర్భంగా సర్పంచ్ లు మాట్లాడుతూ ప్రభుత్వశీ అందించే సౌకర్యాలను వినియోగించుకుని నాణ్యమైన విద్యను పొంది జీవితంలో ఎదగాలని ఆకాంక్షించారు ఇట్టి ఈకార్యక్రమం లో ముచ్చర్ల పాఠశాల చైర్మన్ గాడిచర్ల లక్ష్మి వార్డు సభ్యులు రాకేష్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర రెడ్డి ఉపాధ్యాయులు తాడురీ సంపత్ కుమార్ గుడికాడ కొమరయ్య అజ్మీర కవిత జడల విజయశ్రీ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు



# జగిత్యాల జిల్లాలో ఘనంగా 9వ జాతీయ పోషణ మాసం ముగింపు వేడుకలు

జగిత్యాల,తెలంగాణ పత్రిక, అక్టోబర్ 8:

జగిత్యాల జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 9వ జాతీయ పోషణ మాసం ముగింపు వేడుకలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్ రాజగౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పోషణ అభియాన్ ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న వివిధ సేవలను అభినందించారు. ప్రతి చిన్నారికి పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని, పిల్లల్లో పోషకాహార లోపం లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పోషకాహారం, ప్రీ-స్కూల్ విద్య, ఆరోగ్య సంరక్షణతో పాటు తల్లులు, పిల్లలకు అందిస్తున్న వివిధ సేవలు సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. అంగన్‌వాడీ సేవల ప్రాధాన్యతను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని సూచించారు. సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శన, వివిధ ప్రదర్శన కేంద్రాలను అదనపు కలెక్టర్ పరిశీలించారు. పోషకాహార పదార్థాలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను పరిశీలించారు. పోషణ మాసం వివరాల ప్రకారం అక్టోబర్ 7 నాటికి జిల్లాలోని 1,065 అంగన్‌వాడీ కేంద్రాలకు నిర్దేశించిన 1,22,475 కార్యకలాపాల లక్ష్యానికి గాను 1,23,675 కార్యకలాపాలు నమోదు చేసి 101 శాతం ప్రగతి సాధించినట్లు అధికారులు తెలిపారు. ధర్మపురి ప్రాజెక్టులో 100.7 శాతం, జగిత్యాలలో 99.5 శాతం, మల్లియాలలో 104 శాతం, మెట్‌పల్లిలో 100.5 శాతం కార్యకలాపాలు నమోదైనట్లు వివరించారు.




నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం పోషణ మాసం కార్యక్రమాలను నిర్వహించి, కార్యకలాపాలను నమోదు చేసి జిల్లా స్థాయిలో 101 శాతం ప్రగతి సాధించినందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు, పర్యవేక్షకులు, శిశు అభివృద్ధి పథకం అధికారులు, శాఖ సిబ్బందిని అదనపు కలెక్టర్ అభినందించారు. పోషణ మాసం కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరినీ ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి డా. అడెపు భాస్కర్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. సుజాత, జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి, 12వ వార్డు కౌన్సిలర్ ప్రశాంత్, శిశు అభివృద్ధి పథకం అధికారులు వాణిశ్రీ, వరలక్ష్మి, జయప్రద, పోషణ అభియాన్ జిల్లా సమన్వయకర్త వి. మధుకుమార్, శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి






-ఆస్తి నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు
-రాత్రివేళల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలి
-శివంపేట పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ
-ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్

మెదక్ జిల్లాప్రతినిది (తెలంగాణ పత్రిక) 08 అక్టోబర్

గురువారం శివంపేట పోలీస్‌స్టేషన్‌ను మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతిని పరిశీలించారు. మహిళలు, బాలికలపై జరిగే నేరాలకు సంబంధించిన కేసుల్లో దర్యాప్తును నిర్ణీత గడువులో పూర్తి చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తును వేగవంతం చేయడంతోపాటు, కేసుల పరిష్కారానికి అవసరమైన చర్యలను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. కేసులకు సంబంధించిన సాక్ష్యాధారాలను నిబంధనల ప్రకారం ఈ-సాక్ష్యలో నమోదు చేసి భద్రపరచాలని తెలిపారు. దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. సీసీటీఎన్ఎస్‌లో కేసులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, రికార్డుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని ఆదేశించారు. పెండింగ్ రిపోర్టులను త్వరితగతిన పూర్తి చేసి దర్యాప్తులో పారదర్శకత, క్రమశిక్షణ పాటించాలని స్పష్టం చేశారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆస్తి నేరాలను అరికట్టేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా పెంచాలని సూచించారు. రాత్రివేళల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేసి నేరాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నేరాల నియంత్రణ, నేరస్తుల గుర్తింపులో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కెమెరాలు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ సిబ్బందితో సమావేశమైన ఎస్పీ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సానుకూలంగా పరిష్కరించేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పోలీసింగ్ సేవలు అందిస్తూ పోలీస్‌శాఖపై నమ్మకాన్ని మరింత పెంపొందించేలా పనిచేయాలని సూచించారు. ఈ తనిఖీలో సీఐలు వెంకట రాజా గౌడ్, సందీప్‌రెడ్డి, శివంపేట ఎస్సై మధుకర్‌రెడ్డితో పాటు పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమ నాటుసారా తయారీపై ఎక్సైజ్ శాఖ దాడులు

కామారెడ్డి ,అక్టోబర్ 8, ( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లాఎక్సైజ్ సూపరింటెండెంట్ ముకుంద రెడ్డి ఆదేశాల మేరకు, కామారెడ్డి ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పోశెట్టి ఆధ్వర్యంలో ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది మరియు సంబంధిత అధికారులు గురువారం రామారెడ్డి మండలంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక దాడులు, తనిఖీలు నిర్వహించారు. కామారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కన్నాపూర్ తండా, దుబ్బ తండా, స్కూల్ తండా, జగదాంబ తండా, బట్టు తండా తదితర ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో కన్నెగూడెం తండా శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన 40 లీటర్ల బెల్లం పానకం తయారీకి వినియోగించే ఎఫ్‌జే వాష్‌ను గుర్తించి, అక్కడికక్కడే ధ్వంసం చేశారు. ఈ ఘటనకు సంబంధించి రెండు కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. అదేవిధంగా, పరిధిలోని కల్లు దుకాణాలను తనిఖీ చేసి, నాణ్యతా పరీక్షల నిమిత్తం కల్లు నమూనాలను సేకరించారు. అడ్లూర్ టీసీఎస్ డిపో, దేవునిపల్లి టీఎఫ్‌టీ దుకాణం నంబర్--4, అన్నారం టీఎఫ్‌టీ దుకాణం నంబర్--1 వద్ద కల్లు నమూనాలను సేకరించినట్లు అధికారులు తెలిపారు. అక్రమ నాటుసారా తయారీ, నిల్వ, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు



తీసుకుంటామని, జిల్లాలో అక్రమ మద్యం కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తూ ప్రత్యేక తనిఖీలు, దాడులు నిర్వహిస్తామని ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ పార్టీ



గంభీరావుపేట తెలంగాణ పత్రిక అక్టోబర్ 8

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అత్యంత అట్టహాసంగా ఫ్రెషర్స్ పార్టీని ప్రొఫెసర్ విజయలక్ష్మి అధ్యక్షతన కల్చరల్ కమిటీ ద్వితీయ,తృతీయ సంవత్సర విద్యార్థులు కలిసి నిర్వహించారు విద్యార్థులు ఉదయం నుండి ఎంతో ఉత్సాహంగా వివిధ ఆటపాటలతో అలరించారు ఇట్టి కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్, కమ్యూనికేషన్ స్కిల్స్ పైన నిర్వహించిన సెమినార్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గంభీరావుపేట కళాశాలను ఎంపిక చేసుకున్న ప్రథమ సంవత్సర విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ ఈ కళాశాలలో ఉన్నటువంటి అన్ని మౌలిక సదుపాయాలను వినియోగించుకొని భవిష్యత్తులో మంచి ఉద్యోగంలో స్థిరపడాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆర్గనైజర్ ను అభినందించారు కాలేజీలోని కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన లెక్చరర్ శంకర్ జువాలజీ లెక్చరర్ కె వి బిక్షమయ్య తమ ఆటపాటలతో అలరించారు. ఇట్టి కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం ప్రభాకర్ ఐక్యుఏసి కోఆర్డినేటర్ డాక్టర్ వై ఆంజనేయులు, ఎన్ ఎస్ ఎస్ పి ఓ పాక ధర్మపురి డబ్ల్యూఈసి కోఆర్డినేటర్ వి.వాణి, టాస్క్ కోఆర్డినేటర్ శ్రావణ్ కుమార్ డాక్టర్ ఆది విష్ణు, డాక్టర్ కేవీ బిక్షమయ్య మనోహర్,సుచరణ్ శ్రీనివాస్, కృష్ణ ప్రసాద్ మహేష్,శంకర్, దీపికా భార్గవి, అఖల్య విజయ తదితర అధ్యాపక అధ్యాపకేతర బృందం సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు,విద్యార్థులు పాల్గొన్నారు

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
శుక్రవారం
అక్టోబర్ 09 2026
కరీంనగర్


# ప్రభుత్వ బడుల్లో విద్యా ప్రమాణాలు పెంచాలి

**-వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి**
**-బోర్డు పరీక్షలకు ఇప్పటి నుంచే పకడ్బందీ ప్రణాళిక**
**-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

నిర్మల్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 08 (తెలంగాణ పత్రిక)




ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరిచి, విద్యా ప్రమాణాలను మరింత పెంచేలా ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారికి ప్రత్యేక బోధన అందించాలని సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం విద్యాశాఖపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రతి విద్యార్థి అన్ని సబ్జెక్టుల్లో ప్రగతి సాధించేలా బోధన కొనసాగించాలని, విద్యార్థుల అభ్యసన స్థాయిని ఎప్పటికప్పుడు అంచనా వేయాలని అన్నారు. క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించి, విద్యార్థులు ఏయే అంశాల్లో వెనుకబడి ఉన్నారో గుర్తించి, ఆయా అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థుల్లో పాఠ్యాంశాలపై ఆసక్తి పెరిగేలా వినూత్న బోధనా పద్ధతులను అనుసరించాలని కలెక్టర్ తెలిపారు. కేవలం సిలబస్ పూర్తి చేయడానికే పరిమితం కాకుండా, విద్యార్థులు పాఠ్యాంశాలను పూర్తిగా అర్థం చేసుకునేలా బోధన సాగాలని అన్నారు. ప్రతి విద్యార్థి ప్రతిభను గుర్తించి, వారి సామర్థ్యాలకు అనుగుణంగా ప్రోత్సహించాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు వంద శాతం ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. తరచూ పాఠశాలకు గైర్హాజరవుతున్న విద్యార్థులను గుర్తించి, వారి తల్లిదండ్రులు, పోషకులతో మాట్లాడి గైర్హాజరుకు గల కారణాలను తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలని అన్నారు. బోర్డు పరీక్షలకు విద్యార్థులను ఇప్పటి నుంచే సమగ్ర ప్రణాళికతో సిద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. పరీక్షలపై విద్యార్థుల్లో భయం, ఆందోళన లేకుండా ఉపాధ్యాయులు వారికి ధైర్యం కల్పించాలని అన్నారు. విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ, అవసరమైన ప్రత్యేక తరగతులు నిర్వహించి, మెరుగైన ఫలితాలు సాధించేలా నిరంతరం మార్గనిర్దేశం చేయాలని సూచించారు. విద్యాబోధనతో పాటు పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలల్లో పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన, సురక్షితమైన వాతావరణం ఉండేలా చూడాలని తెలిపారు. సమావేశంలో పాఠశాలల్లో విద్యాబోధన, విద్యార్థుల హాజరు, అభ్యసన సామర్థ్యం, వెనుకబడిన విద్యార్థుల కోసం చేపడుతున్న ప్రత్యేక బోధన, బోర్డు పరీక్షల సన్నద్ధత తదితర అంశాలపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి భోజన్న, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్టీవో అధికారిగా పరిచయం చేసుకుని సైబర్ మోసం - వ్యక్తి అరెస్ట్

**-వివరాలు వెల్లడించిన రూరల్ సీఐ శ్రీనివాస్**

వేములవాడ రూరల్, అక్టోబర్, 08, తెలంగాణ పత్రిక.




వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో హన్మాజిపేటకు చెందిన వ్యక్తిని ఆర్టీవో అధికారిగా పరిచయం చేసుకుని డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్ పేరుతో మోసం చేసి డబ్బులు కాజేసిన వ్యక్తిని వేములవాడ రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. వివరాల్లోకి వెళితే 01.06.2026న హన్మాజిపేటకు చెందిన శ్రీనివాస్ కు ఫోన్ చేసి తాను సిరిసిల్ల ఆర్టీవో ఆఫీస్ నుంచి నరేష్ ను మాట్లాడుతున్నానని పరిచయం చేసుకున్నాడు. లైసెన్స్ రెన్యువల్ చేయకపోతే బ్లాక్ అవుతుందని భయపెట్టి, తన గొంతుమార్చి ఆర్టీవో అధికారిగా నటించి, వెంటనే డబ్బులు చెల్లించాలని నమ్మించి ఫోన్ పే ద్వారా మూడు విడతల్లో మొత్తం రూ.4,200 బదిలీ చేయించుకున్నాడు. బాధితుడి ఫిర్యాదుతో వేములవాడ రూరల్ పీఎస్ లో క్రైమ్ నెంబర్ .115/2026 ఖ/సావష.318(4) దీమీ ఢ సావష.66-ఐ ఐ ్షాష్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బ్యాంకు లావాదేవీలు, మొబైల్ నంబర్లు, వాయిస్ రికార్డింగ్, సాంకేతిక ఆధారాలతో నిందితుడిని నీరటి తిరుమల్, తండ్రి మల్లయ్య, 32 ఏళ్లు, పాత అర్బన్ కాలనీ, వేములవాడగా గుర్తించారు. 08.10.2026న అర్బన్ కాలనీలో అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. నిందితుడి వద్ద నుంచి వివో వి 2036 మొబైల్ ఫోన్, రెండు సిమ్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. గతంలో ఆర్టీవో కన్సల్టెన్సీ షాపులో పనిచేసిన అనుభవంతో పరిచయమైన వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని ఇలా డబ్బులు వసూలు చేసినట్లు తేలింది. మరికొంతమంది నుంచి కూడా వసూలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. బాధితులు ఉంటే వేములవాడ రూరల్ పీఎస్ లో ఫిర్యాదు చేయాలని పోలీసులు కోరారు. ఆర్టీవో, పోలీస్, బ్యాంక్ పేరుతో వచ్చే ఫోన్ కాల్స్ నమ్మి డబ్బులు బదిలీ చేయవద్దని, అనుమానాస్పద కాల్స్ వస్తే 1930 సైబర్ హెల్ప్ లైన్ కు లేదా సమీప పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని రూరల్ సీఐ శ్రీనివాస్ సూచించారు.

# ఆయా శాఖల ఆధ్వర్యంలో పుష్కరాల పనులన్నీ పకడ్బందీగా పూర్తి చేయాలి

**-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**

నిర్మల్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 08 (తెలంగాణ పత్రిక)

గోదావరి పుష్కరాల సందర్భంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనులన్నింటినీ పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి దేవస్థానం ఈవో కార్యాలయంలో పుష్కరాల పనుల నిర్వహణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. బాసరలో జరుగుతున్న పనుల వివరాలను శాఖల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి అధికారి తమ పరిధిలోని పనులను నిరంతరం పర్యవేక్షించాలని, గడువులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు, పార్కింగ్ వంటి సౌకర్యాలన్నీ కల్పించాలని ఆదేశించారు. పుష్కరాల నిర్మాణ పనులకు సంబంధించి అటవీ శాఖ అనుమతులు ఏవైనా ఉంటే, వెంటనే ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించాలని తెలిపారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తుల కోసం విశాలమైన పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని, అలాగే భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ సందీప్, హార్టికల్చర్ అధికారి రమణ, ఆలయ ఈవో అంజనా దేవి, తహసిల్దార్ పవన్ చంద్ర, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఎల్ నినో ప్రభావం వల్ల

**-యాసంగి (రబీ) సీజన్‌లో నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటల సాగును పెద్ద ఎత్తున చేపట్టేలా రైతులకు అవగాహన కల్పించాలి..**
**-జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, వ్యవసాయ, ఉద్యానవన శాఖ..**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి : (తెలంగాణ పత్రిక) అక్టోబర్, 8



జయశంకర్ భూపాలపల్లి గురువారం క్యాంపు కార్యాలయంలో యాసంగిలో పంటల సాగు కార్యాచరణ ప్రణాళికపై వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరి సాగుపై అధికంగా ఆధారపడకుండా జొన్న, మినుములు, పెసర్లు, కూరగాయలు, ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకుని పంటల ప్రణాళిక రూపొందించాలని, భూములు బీడుగా ఉండకుండా ప్రత్యామ్నాయ పంటలు, పప్పుధాన్యాలు, కూరగాయల సాగు వైపు రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటల ప్రయోజనాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, గ్రామస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులతో సమావేశాలు నిర్వహించి సాగు ప్రణాళికపై సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. గత రబీ సీజన్‌లో సాగు పరిస్థితులను సమీక్షించి, లోటుపాట్లను అధిగమించేలా ఈసారి ముందస్తు కార్యాచరణ చేపట్టాలని సూచించారు. జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ, డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియలను వేగవంతం చేసి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. యూరియా పంపిణీలో ఎదురవుతున్న సమస్యలు, అడ్డంకులపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, సాంకేతిక సలహాలు సకాలంలో అందేలా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. సాంప్రదాయ ఎరువుల వినియోగాన్ని తగ్గించి, నానో ఎరువుల వినియోగంపై రైతులకు గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. నానో డీఏపీ, నానో యూరియా వినియోగంతో పంటలకు అవసరమైన పోషకాలు సమర్థంగా అందడంతో పాటు దిగుబడులు పెరిగే అవకాశం ఉందన్నారు. నానో ఎరువుల వల్ల రవాణా, నిల్వ, వినియోగం సులభమవడంతో పాటు రైతులకు ఖర్చు కూడా తగ్గుతుందని తెలిపారు. నానో ఎరువుల ప్రయోజనాలపై ప్రతి రైతుకు అవగాహన కల్పించాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. కోరమండల్ సంస్థ ప్రతినిధులు కూడా గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ ధికారి బాబూరావు, ఉద్యానవన శాఖ అధికారి తిరుపతి, వ్యవసాయ శాఖ ఏడీఏ లు శ్రీపాల్, రమేష్, కోరమండల్ సంస్థ అగ్రోనమిస్ట్ వినోద్, జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ శ్రీధర్ రెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తొమ్మిది రోజుల పాటు ఘనంగా బతుకమ్మ సంబరాలు

**-డా. జీవిఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్టోబర్ 10 నుంచి 18 వరకు వేడుకలు.**
**-ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి బతుకమ్మ సంబరాలు.**
**-ఉత్తమ బతుకమ్మకు ప్రతిరోజూ పట్టుచీర బహుమతి**
**-మరో నలుగురికి ప్రోత్సాహక బహుమతులు.**

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక అక్టోబర్ 8

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఈ ఏడాది కొత్తగూడెంలో తొమ్మిది రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు డా. జీవిఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రకటించింది. గత ఐదేళ్లుగా కొత్తగూడెం నియోజకవర్గంలో నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకలను ఈ ఏడాది మరింత విస్తృతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అక్టోబర్ 10, శనివారం నుంచి అక్టోబర్ 18, ఆదివారం వరకు ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి కొత్తగూడెం విద్యానగర్ కాలనీలోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించనున్నారు. ఈ వేడుకల్లో డా. జీవిఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, తెలంగాణ మాజీ హెల్త్ డైరెక్టర్ డా. గడల శ్రీనివాసరావు పాల్గొననున్నారు. వేడుకల్లో భాగంగా ప్రతిరోజూ అత్యుత్తమంగా అలంకరించిన బతుకమ్మకు పట్టుచీరను ప్రథమ బహుమతిగా, మరో నలుగురు మహిళలకు ప్రోత్సాహక బహుమతులను అందజేయనున్నారు. బతుకమ్మ అంటే కేవలం పండుగ కాదు... తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ఐక్యతకు, మన సంస్కృతికి నిలువెత్తు ప్రతీక. ఈ వేడుకల్లో కొత్తగూడెం నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, బతుకమ్మ సంబరాలను విజయవంతం చేయాలని కోరుకుంటున్నాం.

# జిల్లా వయోవృద్ధులకు కంటి ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**-కామారెడ్డిజిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

కామారెడ్డి, అక్టోబర్ 8, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



27వ ప్రపంచ దృష్టి దినోత్సవం--2026 సందర్భంగా గురువారం కామారెడ్డి ప్రభుత్వ వృద్ధాశ్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నేత్ర పరీక్షా కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జెండా ఊపి ప్రారంభి ంచారు. అనంతరం వృద్ధాశ్రమాన్ని పరిశీలించిన కలెక్టర్, ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమంలోని వయోవృద్ధులకు ఆటో రిఫ్రాక్టోమీటర్ ద్వారా కంటి పరీక్షలు నిర్వహించారు. కంటిశుక్లం గుర్తింపుతో పాటు దృష్టి లోపాలను నిర్ధారించేందుకు రిఫ్రాక్షన్ పరీక్షలు చేపట్టారు. కంటిశుక్లం ఉన్నవారిని గుర్తించి, ఉచిత కంటిశుక్లం శస్త్రచికిత్స కార్యక్రమం కింద ఐఓఎల్ శస్త్రచికిత్స కోసం బోధన్‌లోని లయన్స్ ఐ హాస్పిటల్‌కు తరలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, వయోవృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యంగా వయస్సు పెరిగే కొద్దీ కంటి సమస్యలు వచ్చే అవకాశం ఉన్నందున, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా నేత్ర పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కంటిశుక్లం వంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందితే దృష్టిని మెరుగుపరుచుకోవచ్చన్నారు. వయోవృద్ధులకు అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్ వై గిరి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. వెంకట్, జిల్లా సంక్షేమ అధికారి వెంకటేష్, వృద్ధాశ్రమ సిబ్బంది, వైద్యాధికారి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్ పోటీలకు ఆహ్వానం

**-ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లు, షార్ట్‌ఫిల్మ్ మేకర్లకు అవకాశం**
**-జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**

మెదక్ జిల్లా ప్రతినిధి (తెలంగాణ పత్రిక) 08 అక్టోబర్



పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం, పోలీస్ ఫ్లాగ్‌డేను పురస్కరించుకొని తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివా సరావు ఐపీఎస్ తెలిపారు. జిల్లాలోని ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లు, షార్ట్‌ఫిల్మ్ మేకర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోలీసుల విధులు, ప్రజలకు అందిస్తున్న సేవలు, ప్రజా భద్రత, పోలీస్-ప్రజల సంబంధాలు, విధి నిర్వహణ తదితర అంశాలను ప్రతిబింబించేలా పోటీ ఎంట్రీలు ఉండాలని ఎస్పీ సూచించారు. 2025 అక్టోబర్ నుంచి 2026 అక్టోబర్ వరకు తీసిన మూడు ఫోటోలను, మూడు నిమిషాల నిడివి మించని షార్ట్‌ఫిల్మ్‌లను పోటీలకు పంపించవచ్చని తెలిపారు. జిల్లా స్థాయిలో అందిన ఎంట్రీల నుంచి ఉత్తమ మూడు ఫోటోలు, మూడు షార్ట్‌ఫిల్మ్‌లను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్లు ఎస్పీ తెలిపారు. పాల్గొనదలచిన వారు 10x8 అంగుళాల పరిమాణంలో మూడు ఫోటోల హార్డ్‌కాపీలతో పాటు సాఫ్ట్‌కాపీలను, షార్ట్‌ఫిల్మ్‌ను పెన్‌డ్రైవ్‌లో పొందుపరిచి ఈ నెల 22వ తేదీలోపు మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలోని పీఆర్ఓ సెక్షన్‌లో అందజేయాలని సూచించారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన వారికి ఈ నెల 25వ తేదీన మెరిట్ సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు ఎస్పీ తెలిపారు. పోలీసుల సేవలు, విధి నిర్వహణ, ప్రజా భద్రతను ప్రతిబింబించే మంచి ఫోటోలు, షార్ట్‌ఫిల్మ్‌లను రూపొందించి పోటీల్లో పాల్గొనాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు పీఆర్ఓ: 8712529742 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.